# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక



సంపుటి :12 సంచిక :294 బుధవారం 24-6-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/




## ప్రతి ఓటును కాపాడాలి

- సర్వే అప్రమత్తంగా ఉండాలి
- ఓటర్ల జాబితాలో పొరపాట్లు జరగకుండా చూడాలి
- అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదు కావాలి
- పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలి
- 70 శాతం హామీలు అమలు చేశాం..
- బీఆర్ఎస్ రాజకీయంగా ముగింపు దశలో ఉంది
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైందని, ప్రతి అర్హుడైన ఓటరుకు ఓటు హక్కు కల్పించే బాధ్యత బీఎల్ఏలపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఒక్కో ఓటు ప్రజాస్వామ్యంలో ఎంతటి ప్రభావాన్ని చూపుతుందో గుర్తుంచుకుని పనిచేయాలని సూచించిన మహేష్ కుమార్ గౌడ్, ఎన్నికల్లో ఒక్కో ఓటు ప్రభుత్వాలను గద్దె ఎక్కించే శక్తిని, గద్దె దించే శక్తిని కలిగి ఉంటుందని అన్నారు. అందువల్ల ఓటర్ల జాబితాలో పేరు తొలగిపోవడం, అర్హులైన వారి పేరు నమోదు కాకపోవడం వంటి అంశాలపై

-మిగతా 2 లో

## మెట్రో ఫేజ్-2కు
# గ్రీన్ సిగ్నల్

**ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు ఫలప్రదం**


- కేంద్ర మంత్రి ఖట్టర్ నివాసంలో కీలక భేటీ
- మెట్రో ఫేజ్-1ను పూర్తిగా స్వాధీనం చేసుకోనున్న ప్రభుత్వం
- ఆర్థిక, సాంకేతిక అధ్యయనం కోసం ప్రతిష్టాత్మక కన్సల్టెంట్ ఎంపిక
- కేంద్ర, రాష్ట్ర అధికారులతో ప్రత్యేక సమన్వయ కమిటీ ఏర్పాటు
- మెట్రో విస్తరణపై కేంద్ర మంత్రులతో సీఎం 40 నిమిషాల సుదీర్ఘ చర్చలు

న్యూఢిల్లీ,

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు భవిష్యత్తుకు సంబంధించి అత్యంత కీలకమైన అడుగు పడింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రులతో జరిపిన వరుస సమావేశాలు విజయవంతమయ్యాయి. మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, అలాగే ఫేజ్-2 విస్తరణ పనుల్లో ఉన్న అన్ని ప్రధాన ఆటంకాలు ఈ చర్చలతో తొలగిపోయాయి. మంగళవారం ఉదయం కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు ఉన్నతస్థాయి సంయుక్త సమావేశం జరిగింది. ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు

-మిగతా 2 లో






## 109 కోట్లు దాటిన ఇంటర్నెట్ యూజర్లు.

- ట్రాయ్ తాజా నివేదికలో వెల్లడి
- మూడు నెలల్లోనే 6.24 శాతం పెరిగిన నెట్ సబ్‌స్క్రైబర్లు
- దేశవ్యాప్తంగా 133 కోట్లకు చేరిన మొత్తం ఫోన్ కనెక్షన్లు
- రూ.196.04కు పెరిగిన కంపెనీల సగటు నెలవారీ ఆదాయం
- లైసెన్స్ ఫీజు రూపంలో ప్రభుత్వానికి రూ.6,936 కోట్ల ఆదాయం

న్యూఢిల్లీ,

భారత టెలికామ్ రంగం అప్రతిహత వృద్ధిని కొనసాగిస్తోంది. దేశంలో ఇంటర్నెట్ , టెలిఫోన్ వినియోగదారుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) తన తాజా నివేదికలో వెల్లడించింది. ఆ నివేదిక ప్రకారం.. 2026 మార్చి నాటికి దేశంలో మొత్తం ఇంటర్నెట్ సబ్‌స్క్రైబర్ల

-మిగతా 2 లో



## ఘనంగా పద్మపురస్కారాల ప్రదానం


- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా 65 మందికి పురస్కారాలు
- మలయాళ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ బహూకరణ
- తెలుగు నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లకు పద్మశ్రీ
- హాజరైన ఉపరాష్ట్రపతి, ప్రధాని మోదీ మరియు కేంద్ర మంత్రులు

న్యూఢిల్లీ,

రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 65 మంది ప్రముఖులకు పద్మ అవార్డులు అందజేశారు. ఈ విడతలో మొత్తం 2 పద్మ విభూషణ్, 7 పద్మభూషణ్, 56 పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేశారు. సినీ, సాహిత్య, వైద్య, క్రీడా తదితర రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులు ఈ గౌరవాలను

-మిగతా 2 లో

## పాక్, ఖతార్‌లను నమ్మలేం



- ఉగ్రవాదానికి ఊతమిచ్చిన ఘనత వారిది
- బిన్‌లాడెన్‌ను దాచిపెట్టిన చరిత్ర పాక్‌ది
- జెడి వాన్స్ వ్యాఖ్యలపై ఇద్దరు సెనేటర్ల విమర్శలు


2

## అమెరికా పౌరసత్వం మరింత ఖరీదు

- ఫైలింగ్ ఫీజులను 75శాతం పెంచే యోచన



2



## హిందీ మనకు అవసరం లేదు

- తమిళం, ఇంగ్లీస్ సరిపోతుంది
- నీట్‌తో విద్యార్థుల్లో గందరగోళం
- కుటుంబ పార్టీలకు తాము వ్యతిరేకం
- ప్రజలంతా తమ కుటుంబమనే భావనతో పాలన
- ఎన్నో అవమానాలు ఎదుర్కొని ఇక్కడికి వచ్చా
- ప్రజల సంపూర్ణ మద్దతుతో అధికారం చేపట్టాం
- కరూర్ తొక్కిసలాట ఘటన మరచిపోలేని విషాదం
- అసెంబ్లీలో సిఎం విజయ్ కీలక ప్రసంగం

చెన్నై,

తమిళనాడు విద్యార్థుల్లో నీట్ అసమానతల్ని సృష్టిస్తోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ అన్నారు. అసమానతలకు కారణమైన నీట్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడు అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ మంగళవారం కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా హిందీ వివాదం, నీట్, కరూర్ తొక్కిసలాట ఘటన వంటి పలు అంశాలను ప్రస్తావించిన విజయ్ విమర్శకులకు గట్టిగా బదులిచ్చారు. ఈ మేరకు అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందీ భాషనూ వ్యతిరేకించారు. తమిళం, ఇంగ్లీష్‌లతో కూడిన ద్విభాషా విధానానికే తాము కట్టుబడి ఉంటామన్నారు. నీట్ వల్ల సామాజిక అసమానతలు పెరుగు తున్నాయని సీఎం విజయ్ చెప్పుకొచ్చారు. విద్యార్థులపై తీవ్ర మానసిక ఒత్తిడి తెస్తున్న ఈ పరీక్షను రద్దుచేసి, ఇంటర్ మార్కుల ఆధారంగా వైద్య సీట్లను కేటాయించాలని తమిళనాడు చాలా కాలంగా కోరుతోందని ఆయన గుర్తుచేశారు. హిందీ భాషపైనా స్పందిస్తూ.. తమిళం రాష్ట్ర భాషగా, ఇంగ్లీష్ అంతర్జాతీయ భాషగా సరిపోతాయని తన వైఖరిని స్పష్టం చేశారు. మూడో భాషను బలవంతంగా రుద్దాల్సిన అవసరంలేదని, రెండు భాషల విధానమే కొనసాగుతుందని తేల్చి చెప్పారు. తమ పార్టీని విమర్శించే వారికి ఈ సందర్భంగా గట్టిగా సమాధాన

-మిగతా 2 లో



## కాంగ్రెస్ హామీలపై హరీష్ రావు ఫైర్

- రైతుబంధు, రుణమాఫీపై విమర్శలు
- 'రైతు క్షమాపణ సభ'గా మార్చాలంటూ ఎద్దేవా
- కేసీఆర్ పాలనను గుర్తుచేసిన హరీష్
- 'రైతు ఆశీర్వాద సభ' కాదు.. 'రైతు క్షమాపణ సభ' పెట్టుకోండి.!

భద్రాద్రి కొత్తగూడెం,

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలకు, రైతులకు నమ్మకద్రోహం చేశారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. హామీలు 100 రోజుల్లో నెరవేర్చకపోతే నిలదీయమన్న భట్టి విక్రమార్క మాటలను గుర్తు చేస్తూ.. మరి ఇప్పుడు రండి, మిమ్మల్ని నిలదీస్తాం అని హరీష్ రావు సవాల్ విసిరారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలపై హరీష్ రావు తీవ్రస్థాయిలో

-మిగతా 2 లో

## ఆయిల్ పామ్ రైతులకు
# రక్షణ కల్పించాలి

**దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలి**

- తెలంగాణకు తక్షణమే డీఏపీ, యూరియా సరఫరా చేయాలి
- పప్పుధాన్యాలు, నూనెగింజల కొనుగోలుపై 25 శాతం పరిమితి ఎత్తివేయాలి
- మొక్కజొన్న, జొన్నలను కేంద్రం ఎంస్‌పిపై కొనుగోలు చేయాలి
- తెలంగాణ రైతాంగ ప్రయోజనాల కోసం కేంద్రానికి వినతులు
- కేంద్ర మంత్రులను కలిసిన తుమ్మల, ఉత్తమ్

న్యూఢిల్లీ,

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని బృందం మంగళవారం న్యూఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, రైతాంగ ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ,

-మిగతా 2 లో



## రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోదీ భేటీ



- క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణపై చర్చ?

న్యూఢిల్లీ

కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై జోరుగా చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును రాష్ట్రపతి భవన్‌లో కలుసుకున్నారు. ఈ భేటీకి సంబంధించిన చిత్రాలను రాష్ట్రపతి కార్యాలయం ఎక్స్ వేదికగా పంచుకుంది.

-మిగతా 2 లో



## స్వయం సమృద్ధి గ్రామాలే లక్ష్యం

- శాఖల సమన్వయంతో ఆదర్శ గ్రామాల నిర్మాణం
- గ్రామ ప్రణాళికలను రెండు నెలల్లో సిద్ధం చేసి అమలు చేయాలి
- నిధుల దుర్వినియోగంపై కఠిన చర్యలు
- స్థానిక వనరులతోనే తాగునీటి సమస్య పరిష్కారం
- అధికారులకు మంత్రి సీతక్క దిశానిర్దేశం

2

# ప్రతి ఓటును కాపాడాలి

మొదటి తరువాయి

బూత్ స్థాయిలో నిరంతరం నిఘా ఉంచాలని బీఎల్ఏలకు సూచించారు. సర్ ప్రక్రియ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించాలని, కొత్తగా అర్హత సాధించిన యువతను ఓటర్లుగా నమోదు చేయించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అలాగే మరణించినవారి పేర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి వివరాల విషయంలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేలా సహకరించాలని చెప్పారు. ఓటర్ల జాబితా పకడ్బందీగా ఉండేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్న ఆయన, ఓటర్ల జాబితాలో జరిగే చిన్న పొరపాటు కూడా ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని అన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సర్ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని తెలిపారు. ప్రతి బీఎల్ఏ ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రజలకు ఈ అవగాహన సదస్సులో స్థానిక కాంగ్రెస్ నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సర్ ప్రక్రియలో చేపట్టాల్సిన చర్యలు, ఎన్నికల నిబంధనలు, ఓటర్ల నమోదు విధానం తదితర అంశాలపై వారికి వివరించారు. కార్యక్రమం ముగింపులో పార్టీ శ్రేణులు ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు. సమాచారం అందించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై మాట్లాడిన మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే సుమారు 70 శాతం అమలు చేసిందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, మిగిలిన హామీల అమలుకు కూడా కట్టుబడి ఉందని చెప్పారు. రైతులు, మహిళలు, యువత, పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు గుప్పించిన ఆయన, ప్రజలు ఇప్పటికే ఆ పార్టీని తిరస్కరించారని అన్నారు. గత పాలనలో జరిగిన తప్పిదాలు, ప్రజా వ్యతిరేక నిర్ణయాల కారణంగా బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయిందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఆ పార్టీ రాజకీయంగా ముగింపు దశకు చేరుకుందని, ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. రానున్న రోజుల్లో పార్టీ మరింత బలోపేతం కావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# 109 కోట్లు దాటిన ఇంటర్నెట్ యూజర్లు.

మొదటి తరువాయి

సంఖ్య 109.27 కోట్లకు చేరింది. 2025 డిసెంబర్ చివరి నాటికి ఈ సంఖ్య 102.86 కోట్లుగా ఉండగా.. కేవలం మూడు నెలల్లోనే 6.24 శాతం వృద్ధి నమోదైంది.ట్రాయ్ నివేదిక ప్రకారం.. మొత్తం ఇంటర్నెట్ వినియోగదారులలో 104.62 కోట్ల మంది వైర్‌లెస్ ద్వారా, 4.65 కోట్ల మంది వైర్డ్ కనెక్షన్ల ద్వారా ఇంటర్నెట్ సేవలు పొందుతున్నారు. వీరిలో బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారుల సంఖ్య 106.58 కోట్లుగా ఉండగా.. న్యారోబ్యాండ్ (56 కేబీపీఎస్ కంటే తక్కువ వేగం) సబ్‌స్క్రైబర్లు 2.69 కోట్లుగా ఉన్నారు. త్రైమాసిక ప్రాతిపదికన బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల బేస్ 5.81 శాతం పెరగడం విశేషం. ఇంటర్నెట్‌తోపాటు మొత్తం టెలిఫోన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య కూడా 133.05 కోట్లకు పెరిగింది. దాంతో దేశవ్యాప్తంగా టెలి-డెన్సిటీ (ప్రతి 100 మందికి ఉన్న ఫోన్ కనెక్షన్లు) గత త్రైమాసికంలోని 91.74 శాతం నుంచి 93.26 శాతానికి మెరుగుపడింది. వైర్‌లైన్ టెలిడెన్సిటీ సైతం 3.33 శాతం నుంచి 3.38 శాతానికి పెరిగింది. వినియోగదారుల నుంచి వచ్చే సగటు నెలవారీ ఆదాయం కూడా టెలికామ్ సంస్థలకు సానుకూలంగా ఉంది. వైర్‌లెస్ సేవలకు సంబంధించి ఏఆర్‌పీయూ 0.76 శాతం పెరిగి రూ.196.04కి చేరింది. వార్షిక ప్రాతిపదికన చూస్తే ఇది 7.15 శాతం పెరుగుదల. అదేవిధంగా వినియోగ సమయం కూడా స్వల్పంగా పెరిగి నెలకు సగటున 1,017 నిమిషాలకు చేరింది. టెలికామ్ రంగం వృద్ధి ప్రభుత్వ ఆదాయానికి కూడా ఊతమిచ్చింది. 2026 మార్చితో ముగిసిన త్రైమాసికంలో టెలికామ్ కంపెనీల నుంచి లైసెన్స్ ఫీజు రూపంలో ప్రభుత్వానికి రూ.6,936 కోట్ల ఆదాయం లభించింది. అంతకుముందు త్రైమాసికంలో ఇది రూ.6,733 కోట్లుగా ఉంది. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అనుమతి పొందిన 917 ప్రైవేట్ శాటిలైట్ టీవీ ఛానెళ్లు దేశంలో కార్యకలాపాలు సాగిస్తున్నాయని కూడా ట్రాయ్ తన నివేదికలో పేర్కొన్నది.

# ఘనంగా పద్మపురస్కారాల ప్రదానం

మొదటి తరువాయి

అందుకున్నారు. మలయాళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ పురస్కారం లభించింది. అలాగే ప్రముఖ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయుడుకు కూడా పద్మభూషణ్ అవార్డు ప్రదానం చేశారు. తెలుగు సినీ రంగానికి చెందిన ప్రముఖ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌తో పాటు నటుడు ఆర్. మాధవన్‌కు పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. క్రికెటర్ రోహిత్ శర్మకు కూడా పద్మశ్రీ అవార్డును రాష్ట్రపతి అందజేశారు. ప్రఖ్యాత మలయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ పద్మవిభూషణ్ అందుకోగా.. సినీ రంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తో పాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి నేడు పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సినీ నటులు మాగంటి మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్ ఉన్నారు. అలాగే, వీరితో పాటు సినీనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్ శర్మ, పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు. దేశంలోని పలు రంగాల్లో విశేష సేవలందించిన వారికి భారత గణతంత్ర దినోత్సవం వేళ కేంద్రం మొత్తం 131 మందికి పద్మ పురస్కారాలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తొలి విడతలో 66 మందికి అందజేయగా.. మిగతా వారికి మంగళవారం ప్రదానం చేశారు. దేశ అభివృద్ధికి, తమ తమ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను గౌరవించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పద్మ పురస్కారాలను ప్రదానం చేస్తోంది. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా పౌరసత్వం మరింత ఖరీదు

## ఫైలింగ్ ఫీజులను 75శాతం పెంచే యోచన



**వాషింగ్టన్,**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇమిగ్రేషన్ రూల్స్‌ను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరసత్వం మరింత ఖరీదుగా మారనుంది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చిన వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే.. ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సిరావడంతో పాటు ఇప్పటివరకు ఉన్న పలు మినహాయింపులను కూడా కోల్పోనున్నారు.

# హిందీ మనకు అవసరం లేదు

మొదటి తరువాయి

మిచ్చారు సీఎం విజయ్. ప్రజల మద్దతుతోనే తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధికారంలోకి వచ్చిందన్న ఆయన.. దీని వెనుక ఎన్నో కుట్రలు, సవాళ్లను ఎదుర్కొ న్నామన్నారు. 'జనం గుండెల్లో స్థానం సంపాదించడం అంత సులువు కాదు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే ఇక్కడకు వచ్చాం. అయినప్పటికీ కొందరు 'నటుడి పార్టీ' అనే విమర్శలు గుప్పిస్తున్నారు. వాటన్నింటినీ మేం పట్టించుకోం. మా రాజకీయాలు పారదర్శకంగా ఉంటాయని విజయ్ చెప్పుకొచ్చారు. అలాగే కుటుంబ రాజకీయాలపై ఆయన మాట్లాడుతూ.. 'మా రాజకీయాలు ఒక్క కుటుంబం కోసమే కాదు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం మాదే. అదే మా పాలన.. అదే మా లక్ష్యం' అని స్పష్టం చేశారు. ఎన్నో సవాళ్లను దాటి తాము అధికారంలోకి వచ్చామని, నటుడి పార్టీ అని తమను ఎంతోమంది ఎగతాళి చేశారని గుర్తుచేసుకున్నారు. మాకు ఈ అధికారం అంత సులువుగా వచ్చింది కాదు. తమిళనాడు ప్రజల హృదయాలను గెలుచుకునేందుకు నేను, నా పార్టీ ఎన్నో కుట్రలు, సవాళ్లను అధిగమించాల్సి వచ్చింది. మాది యాక్టర్ పార్టీ అని, నేను సినిమా షూటింగ్ నుంచి నేరుగా సీఎం కుర్చీలో కూర్చున్నానని చాలా మంది గేలి చేశారు. అలాంటి విమర్శలు నేను పట్టించుకోను. సాధారణంగా చాలా మంది రాజకీయ పార్టీ పెట్టి ప్రజల్లోకి వెళ్తారు. కానీ, నేను ప్రజల్లోకి వెళ్లిన తర్వాత పార్టీ పెట్టి ఎన్నికల్లో పోటీ చేశా. నాపై నమ్మకం ఉంచి ప్రజలు గెలిపించారని విజయ్ అన్నారు. తమిళనాడులో ద్విభాషా విధానానికే తాము కట్టుబడి ఉన్నట్లు సీఎం పునరుద్ఘాటించారు. హిందీ భాషను రుద్దేందుకు కేంద్రం చేస్తోన్న ప్రయత్నాలను తాము ఎప్పటికీ అంగీకరించబోమన్నారు. ప్రసంగంలో భాగంగా ఎన్నికల ప్రచార సమయంలో చోటుచేసుకున్న కరూర్ తొక్కిసలాట ఘటనను విజయ్ ప్రస్తావించారు. 41 మంది ప్రాణాలు కోల్పోయిన ఆ విషాద ఘటన నన్ను ఎంత వేదనకు గురిచేసిందో మాటల్లో చెప్పలేను. ఆ బాధ నన్ను ఎన్నటికీ వదలదు. ఆ ఘటన విషయం లోనూ మాపైనే నిందలేశారు. ఇది అత్యంత దారుణం. రాజకీయాలు ఇంత క్రూరంగా ఉంటాయా అని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారసత్వ రాజకీయాల గురించి స్పందిస్తూ డీఎంకేపై విజయ్ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. డీఎంకేను ఉద్దేశిస్తూ కేవలం ఒక కుటుంబానికే ప్రాధాన్యమివ్వడం మా రాజకీయ విధానం కాదు. తమిళనాడులోని ప్రతి కుటుంబానికి మా సేవలందిస్తాం. అదే మా రాజకీయం. అదే మా పాలనా విధానమని విజయ్ పేర్కొన్నారు.


# మెట్రో ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్

మొదటి తరువాయి

కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్, జి. కిషన్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. మెట్రో విస్తరణ, నిధుల సమీకరణ, కేంద్ర-రాష్ట్ర ఉమ్మడి భాగస్వామ్యంపై ఈ సమావేశంలో అందరూ ఒక ఏకాభిప్రాయానికి వచ్చారు. మెట్రో ప్రాజెక్టును ఆర్థికంగా, సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిష్ఠాత్మక ఆర్థిక సలహా సంస్థను కన్సల్టెంట్‌గా ఎంపిక చేశారు. ఈ సంస్థ ప్రధాన అంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వనుంది. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకుంటున్న నేపథ్యంలో.. దానికి సంబంధించిన అప్పులు, ఈక్విటీ విలువ రుణ సేకరణపై రోడ్ మ్యాప్ తయారు చేస్తుంది. ఫేజ్-2 కింద ప్రతిపాదించిన కారిడార్ల నిర్మాణ వ్యయం ఎంత అవుతుంది? నిధుల కోసం ఏయే అంతర్జాతీయ రుణ సంస్థలను ఎంచుకోవాలి? అనే అంశాలపై నివేదిక అందిస్తుంది. ఈ కన్సల్టెంట్ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా తదుపరి అడుగులు వేస్తాయి. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కేందప్రభుత్వ ప్రతినిధితో పాటు తెలంగాణ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి సమన్వయ సభ్యులుగా వ్యవహరిస్తారు. కేంద్ర నిబంధనల ప్రకారం డీపీఆర్ లలో మార్పులు చేస్తూ, పనుల అనుమతుల పక్రియను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ పరిణామంతో హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు కేంద్ర ఆమోదం లభించడం సులభతరం కానుంది. ఇది హైదరాబాద్ నగర ట్రాఫిక్ కష్టాలను తీర్చడమే కాక, భవిష్యత్తు ప్రజా రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలవనుంది. కేంద్రమంత్రి ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో.. హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. మెట్రో ప్రాజెక్టుకు అప్పులు, రెండో ఫేజ్‌కు అనుమతులు, నిధులు కావాలని సీఎం రేవంత్ కోరినట్లు సమాచారం. సమావేశంలో సీఎస్ రామకృష్ణ రావు, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు. రెండు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోనే ఉన్నారు. కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలతో బిజీబిజీగా గడుపు తున్నారు. ఇప్పటికే ఢిల్లీలో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు.. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కలిశారు.

# పాక్, ఖతార్‌లను నమ్మలేం

**-ఉగ్రవాదానికి ఊతమిచ్చిన ఘనత వారిది**
**-బిన్‌లాడెన్‌ను దాచిపెట్టిన చరిత్ర పాక్‌ది**
**-జెడి వాన్స్ వ్యాఖ్యలపై ఇద్దరు సెనేటర్ల విమర్శలు**



వాషింగ్టన్,
పాకిస్థాన్‌పై ప్రేమను వ్యక్తం చేస్తూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై అమెరికాకు చెందిన ఇద్దరు సెనేటర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ దేశ ఉగ్రచరిత్ర గురించి ప్రస్తావిస్తూ, బిన్ లాడెన్‌ను దాచిన ఘనత పాక్‌దని అన్నారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, ఖతార్ దేశాలపై అమెరికాకు చెందిన ఇద్దరు రిపబ్లికన్ సెనేటర్లు రిక్ స్కాట్, టిమ్ షీహీ ఘాటుగా స్పందించారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన చరిత్ర ఆ దేశాలకు ఉందంటూ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. కాగా, అమెరికా- ఇరాన్ శాంతి ఒప్పందానికి సంబంధించిన సాంకేతిక వివరాలపై స్విట్జర్లాండ్‌లో ఇటీవల చర్చలు జరిగాయి. ఈ సమావేశానికి పాకిస్థాన్, ఖతార్ నాయకులతో వాన్స్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 'మేము పాకిస్తాన్‌ను ప్రేమిస్తున్నాం' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. అయితే, ఈ చర్చల్లో పాకిస్థాన్, ఖతార్‌లను నిష్పక్షపాత మధ్యవర్తులుగా చూడకూడదని సెనేటర్ రిక్ స్కాట్ తేల్చి చెప్పారు. మధ్యప్రాచ్యంలో యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలే వాషింగ్టన్‌కు నిజమైన మిత్రదేశాలని పేర్కొన్నారు. ఆ దేశాలనూ అమెరికా చర్చల్లో చేర్చుకోవాలని స్కాట్ సూచించారు. 'మన నిజమైన స్నేహితులు ఎవరో ఇప్పటికే అందరికీ స్పష్టంగా తెలిసి ఉండాలి. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన సుదీర్ఘ చరిత్ర ఖతార్, పాకిస్థాన్‌లకు ఉంది. ప్రస్తుతం వారు అర్థవంతమైన శాంతిని సాధించడం కంటే ఇరాన్ దశాబ్దాల నాటి ఉగ్రవాద ప్రచారాన్ని ప్రోత్సహించడానికే మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది. అందరికీ ప్రయోజనం చేకూర్చే ఆచరణీయమైన ఒప్పందానికి ఇంకా ఆస్కారం ఉంది' అని ఆయన చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా మోంటానా సెనేటర్ టిమ్ షీహీ కూడా పాకిస్థాన్‌ను విమర్శించారు. 'పాకిస్థాన్ ఒక దశాబ్దం పాటు బిన్ లాడెన్‌కు ఆశ్రయం ఇచ్చిందనే విషయాన్ని మనం మరిచిపోకూడదు. పాకిస్థానీలు ఐఎస్ఐ ద్వారా మాపై పోరాడే వారికి నిధులు సమకూర్చారు. ముఖ్యంగా అయతుల్లాకు నిధులు అందించారు. ఖతార్ కూడా దశాబ్దాలుగా ఉగ్రవాద సంస్థలకు మనీలాండరింగ్ ద్వారా డబ్బును అందిస్తోంది. ఇరాన్, అమెరికా- ఇజ్రాయెల్ శాంతి ఒప్పందంలో పాకిస్థాన్, ఖతార్‌లు పాల్గొంటే.. ఆ చర్చల్లో యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలనూ చేర్చుకోవాలి. మధ్యప్రాచ్యంలో ఆ మూడు దేశాలే అమెరికాకు నిజమైన మిత్రదేశాలు' అని పేర్కొన్నారు. కాగా, వీరి వ్యాఖ్యలు ఇప్పటికే ఉన్న వివాదానికి మరింత ఆజ్యం పోసినట్లు అయ్యింది.

# ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించాలి..

మొదటి తరువాయి

రైతుల ప్రయోజనాల పరిరక్షణ, దేశీయ వంటనూనెల ఉత్పత్తి పెంపుపై విస్తృతంగా చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్-ఆయిల్ పామ్ లక్ష్యాలను అత్యంత సమర్థవంతంగా అమలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి తుమ్మల వివరించారు. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరించగా, 70 వేల మందికిపైగా రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. రాబోయే మూడేళ్లలో ఈ విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. భారత్ ప్రస్తుతం వంటనూనెల అవసరాల్లో దాదాపు 60 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోందని, ఈ పరిస్థితిని మార్చేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ఔఓఇక్ష-క్షఖ కార్యక్రమం దేశ ఆర్థిక వ్యవస్థకు, రైతాంగానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. అయితే ఇటీవల క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 44 శాతం నుంచి 16 శాతానికి తగ్గించడం వల్ల దేశీయ ఆయిల్ పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దిగుమతి సుంకం తగ్గింపుతో విదేశాల నుంచి చౌక ధరలకు పామాయిల్ దిగుమతులు పెరిగి దేశీయ మార్కెట్లో ధరలు పడిపోతున్నాయని, దీనివల్ల ఆయిల్ పామ్ రైతులు ఉత్పత్తి చేస్తున్న ఫ్రెష్ ఫ్రూట్ బంచ్‌లకు గిట్టుబాటు ధర లభించడం లేదని వివరించారు. దీర్ఘకాలిక పంట అయిన ఆయిల్ పామ్ సాగుకు రైతులు భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ధరల అనిశ్చితి రైతుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. దిగుమతి సుంకాన్ని తిరిగి 44 శాతానికి పెంచడం ద్వారా దేశీయ ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఆత్మనిర్భర్ భారత్, ఎడిబుల్ ఆయిల్ స్వయం సమృద్ధి లక్ష్యాలు కూడా సాధ్యమవుతాయని మంత్రులు పేర్కొన్నారు. అలాగే ఆయిల్ పామ్ రైతులకు కనీస గ్యారంటీ ధర విధానాన్ని అమలు చేసే అంశాన్ని కూడా కేంద్రం పరిశీలించాలని కోరారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఆయిల్ పామ్ రైతుల భవిష్యత్తు దృష్ట్యా దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించి రైతులకు భరోసా కల్పించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని మంత్రులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణ రైతాంగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. రాష్ట్రంలో ఈ ఏడాది వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో డి.ఎ.పి, యూరియా ఎరువుల అవసరం గణనీయంగా పెరిగిందని, కేంద్రం కేటాయించిన కోటాకు మరియు వాస్తవ సరఫరాకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వెంటనే పూడ్చి, రాష్ట్రానికి పూర్తి స్థాయిలో ఎరువులు అందించాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఎరువుల సరఫరాను నిరంతరాయంగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పప్పుధాన్యాలు, నూనెగింజల కొనుగోళ్లపై ప్రస్తుతం అమలులో ఉన్న 25 శాతం పరిమితి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని పేర్కొన్నారు. రైతులు ఉత్పత్తి చేసిన మొత్తం పంటను కనీస మద్దతు ధర (ఓ÷ఖఖ) కింద కొనుగోలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుని ఆ పరిమితిని పూర్తిగా తొలగించాలని కోరారు.

# రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోదీ భేటీ

మొదటి తరువాయి

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగవచ్చన్న ఊహాగానాలు దేశ రాజధానిలో ఊపందుకున్న వేళ ఈ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది.కాగా, మంగళవారం ఉదయం కేరళకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు జార్జి కురియన్ కేంద్ర మంత్రివర్గానికి రాజీనామా చేశారు. ఆయన రాజ్యసభ పదవీకాలం ముగిసిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. 65 ఏండ్ల కురియన్ కేంద్ర మైనారిటీ వ్యవహారాలు, మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ శాఖల సహాయ మంత్రిగా ఉన్నారు. ఆయన రాజీనామాను రాష్ట్రపతి ముర్ము ఆమోదించారు. జూన్ 21న రాజ్యసభ సభ్యత్వ పదవీకాలం పూర్తయిన కురియన్‌ను తిరిగి రాజ్యసభకు నామినేట్ చేయకూడదని బీజేపీ నిర్ణయించింది.

# స్వయం సమృద్ధి గ్రామాలే లక్ష్యం



**తెలంగాణ బ్యూరో ప్రతినిధి**
తెలంగాణ గ్రామాలను స్వయం సమృద్ధి, ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాభివృద్ధి కోసం శాఖలు విడివిడిగా కాకుండా ఉమ్మడి ప్రణాళికతో ముందుకు సాగితే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని ఆమె పేర్కొన్నారు. ప్రతి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని, వచ్చే రెండు నెలల్లో గ్రామ ప్రణాళికలను సిద్ధం చేసి అమలు చేసే కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఐదేళ్లలో గ్రామాలకు భారీగా నిధులు వస్తున్నప్పటికీ వాటిని సమర్థవంతంగా వినియోగించడంలో లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామసభ నిర్వహించకుండా నిబంధనల విరుద్ధంగా నిధులు ఖర్చు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జీపీ నిధులు సరైన మార్గంలో ఖర్చు అయ్యేలా లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్లు పర్యవేక్షించాలని సూచించారు. అటవీ, ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి కేంద్ర అటవీశాఖ అభ్యంతరాలు వ్యక్తం చేయడం వల్ల గిరిజన గ్రామాలు ఇంకా మౌలిక సదుపాయాలకు దూరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. గ్రామాల్లో చెరువులు, బావులను సంరక్షించాలని, ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మిషన్ భగీరథ నీటిపై ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. గ్రామ అభివృద్ధి తోనే తెలంగాణ పురోగతి పరిపూర్ణమవుతుందని, 1.35 లక్షల మంది సిబ్బంది, రూ.34 వేల కోట్ల వార్షిక బడ్జెట్‌ను సమర్థవంతంగా వినియోగిస్తే అభివృద్ధి చెందిన తెలంగాణను నిర్మించవచ్చని మంత్రి సీతక్క పేర్కొన్నారు. అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ హామీలపై హరీష్ రావు ఫైర్

మొదటి తరువాయి

ధ్వజమెత్తారు. మేమిచ్చిన పంటల బోనస్ 3 సార్ల రైతు బంధు కంటే ఎక్కువ అని మంత్రి జూపల్లి కృష్ణారావు అంటుండు. అసలు జూపల్లికి తెలివి ఉందా..? అని మాజీ మంత్రి మండిపడ్డారు. అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. రెండు బోనస్‌లు అయితే ఎగ్గొట్టినవ్.. పోయిన యాసంగి బోనస్ రూ.1200 కోట్లు, ఈ యాసంగి బోనస్ రూ. 1000 కోట్లు ఎగ్గొట్టినవ్ అని సీఎం రేవంత్ రెడ్డిపై ఫైర్ అయ్యారు. అంతగొడితే నువ్వు బోనస్ ఇచ్చింది రూ.2500 కోట్లు.. కానీ మీరు ఎగగొట్టిన రైతు బంధు విలువ రూ.29,350 కోట్లు అని ధ్వజమెత్తారు. జూపల్లి తెలుసుకో లెక్క. చర్చ పెడదామా.. అసెంబ్లీకి వచ్చి మాట్లాడదాం. నువ్వు ఇచ్చిన బోనస కేవలం 3వేల కోట్లు కూడా దాటదు. నువ్వేమైనా తెలిసి మాట్లాడుతున్నవా.. తెలియక మాట్లాడు తున్నవా..? చిన్న మెదడు ఏమైనా చితికిపోయిందా..? నాకైతే అర్థమైతలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలకు ఎక్కువ.. చేతలకు తక్కువ. ఆయన దగ్గర మూడు శాఖలున్నాయి. విద్యాశాఖ, హోంశాఖ, మున్సిపల్ శాఖ.. ఈ మూడింటిలో కూడా అట్టర్‌ఫ్లాప్ అయిండని హరీశ్ రావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులుండి చేసింది గుండుసున్నా. రేవంత్ రెడ్డి మూడు శాఖలు పెట్టుకుని చేసింది కూడా గుండు సున్నా. విద్యాశాఖ మంత్రిగా ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణలో రేవంత్ రెడ్డి ఫెయిల్ అయిపోయిండు.. మున్సిపల్ శాఖ, హోంమంత్రిగా ఫెయిల్ అయిండు. కానీ ఒక్క దాంట్లో మాత్రం పాసయ్యిండు. ఢిల్లీకి సంచులు మోసే శాఖలో మాత్రం పాసయ్యిండంటూ ఎద్దేవా చేశారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన హామీలు , వాటిపై ఆయన ఎన్నిసార్లు మాట తప్పారో చూపే ప్రత్యేక వీడియోలను స్క్రీన్‌పై ప్లే చేస్తూ హరీష్ రావు కాంగ్రెస్ తీరును ఎండగట్టారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రెండు పంటలకు రూ. 10 వేలు చొప్పున రైతుబంధు ఇస్తుంటే, తాము అధికారంలోకి వస్తే మూడు పంటలకు రూ. 15 వేలు ఇస్తామని కాంగ్రెస్ నేతలు నమ్మబలికారని హరీష్ రావు విమర్శించారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీని ఎందుకు అమలు చేయలేదని ఆయన నిలదీశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులను పెండింగ్‌లో పెట్టిందని ఆరోపించారు. కరోనా మహమ్మారి వంటి అత్యంత కఠినమైన ఆర్థిక పరిస్థితుల్లో కూడా ఎక్కడా ఆగకుండా 13 లక్షల రైతు కుటుంబాలకు రూ. 73 వేల కోట్ల రైతుబంధు నిధులను సకాలంలో అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని గుర్తు చేశారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా ప్రజలకు ఏం కావాలో ముందే గుర్తించి చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఇప్పుడు అచ్చంపేట చూసినా, అశ్వారావుపేట చూసినా ప్రజలందరి నోటా 'మళ్లీ కేసీఆర్ రావాలి' అనే మాట ఒక్కటే వినిపిస్తోందని అన్నారు. రెండు లక్షల రైతు రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ఎగ్గొట్టిందని హరీష్ రావు ధ్వజమెత్తారు. భద్రాద్రి రాముడిని సాక్షిగా పెట్టి రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి, చివరకు ఆ దేవుడినే మోసం చేశారని, ఇక ప్రజలను మోసం చేయకుండా ఉంటారా అని ప్రశ్నించారు. త్వరలోనే మధిరలో భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి పాల్గొనే సభకు 'రైతు ఆశీర్వాద సభ' అని పేరు పెట్టడం రైతాంగాన్ని అవమానించడమేనన్నారు. రైతులను మోసం చేసినందుకు గానూ ఆ సభకు 'రైతు క్షమాపణ సభ'గా నామకరణం చేసుకోవాలని హరీష్ రావు ఎద్దేవా చేశారు.

## హర్మూజ్‌ను తెరిచే ఉంచుతాం..


-అవసరమైతే నిర్బంధానికి సిద్ధమే..!



**న్యూఢిల్లీ, జూన్ 23 జర్నలిస్టు డైరీ**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హర్మూజ్ జలసంధి విషయంలో తన వైఖరిని స్పష్టం చేశారు. అంతర్జాతీయ జల రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిని తెరిచే ఉంచుతామని పేర్కొన్న ట్రంప్.. అవసరమైతే తమ నౌకా దళాలను మోహరించి.. దిగ్బంధిస్తామని ఇరాన్‌ను హెచ్చరించారు. ప్రస్తుతానికి హర్మూజ్ బ్లాకేడ్‌పై తొందరపడడం లేదని, ఇరాన్ దారికి రాకుంటే నిర్బంధం తప్పదని ట్రంప్ తేల్చి చెప్పారు.హర్మూజ్ జలసంధి మూసివేతపై సోషల్ మీడియా ట్రుత్ వేదికగా డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇరాన్‌తో చర్చలు ఫలవంతమయ్యేలా కనిపిస్తున్నందున తాను హర్మూజ్‌ను తెరిచి ఉంచేందుకు అంగీకరించానని అమెరికా అధ్యక్షుడు తెలిపారు.'హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచేందుకు నేను అంగీకరించాను. ఇకపై నౌకలతో హర్మూజ్‌ను దిగ్బందించం. అదే సమయంలో మా నౌకలన్నీ బ్లాకేడ్‌కు సిద్ధంగా ఉన్నాయి. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో దిగ్భంధనం వద్దనిపిస్తోంది అని ట్రుత్ పోస్ట్‌లో పేర్కొన్న ట్రంప్.. అణ్వాయుధాల పరిశీలనకు ఇరాన్ పూర్తిగా అంగీకరించిందని వెల్లడించారు. ఒకవేళ టెహ్రాన్ తమ అణ్వాయుధాల పరిశీలనకు అనుమతించకుంటే చర్చలను నిలిపివేస్తామ'ని ట్రంప్ హెచ్చరించారు. ఓవైపు శాంతి చర్చలు జరుగుతుండగానే.. లెబనాన్‌పై ఇజ్రాయేల్ దాడులకు ప్రతిచర్యగా హర్మూజ్‌ను ఇరాన్ మూసివేసిన విషయం తెలిసిందే.

## హాట్ ఎయిర్ బెలూన్‌లో మంటలు..

8 మంది మృతి



**హైదరాబాద్ జూన్ 23 జర్నలిస్టు డైరీ**
సౌత్ బ్రెజిల్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శాంటా కాటరినాలో 21 మంది హాట్ ఎయిర్ బెలూన్ ఎక్కారు. అయితే గాల్లోకి వెళ్లగానే బెలూన్‌లో మంటలు చెలరేగాయి. బెలూన్ మొత్తం మంటలు వ్యాపించింది. కొందరు పర్యాటకులకు భయంతో కిందకు దూకేశారు. మరికొందరు గాల్లోనే సజీవదహనం అయ్యారు. ఈ ఘటనలో 8 మంది మృతి చెందారు.

## లక్నో కోచింగ్ సెంటర్ కూల్చివేతకు నోటీసులు



**లక్నో జూన్ 23 జర్నలిస్టు డైరీ**
ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఓ కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం జరిగిన ఘటనలో 15 మంది సజీవదహనమైన విషయం తెలిసిందే. నగరంలోని అలీగంజ్ ఏరియాలో ఉన్న ఆ మూడు అంతస్తుల భవనాన్ని కూల్చివేసేందుకు లక్నో డెవలప్మెంట్ అథారిటీ కూల్చివేత ఆదేశాలు జారీ చేసింది. రెసిడెన్షియల్ బిల్డింగ్ పేరుతో ఉన్న ఆ భవనంలో కమర్షియల్ స్పేస్‌ను ఎలా నిర్మించాలని అధికారులు ఆరా తీస్తున్నారు. లక్నో మున్సిపల్ అధికారులపైన కూడా చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు సిద్మయ్యారు. వాస్తవానికి ఆ బిల్డింగ్‌ను కూల్చివేయాలని 2016లో ఆదేశాలు జారీ చేశారు. అనుమతి లేని నిర్మాణంగా భావిస్తూ ఆ ఆదేశాలు ఇచ్చారు. కానీ రెండు నెలల్లోనే మళ్లీ ఆ ఆదేశాలను వెనక్కి తీసుకున్నారు.అలీగంజ్ బిల్డింగ్ కూల్చివేతకు ఆదేశాలు ఇచ్చినట్లు ఎల్‌డీఏ వైస్ చైర్మెన్ ప్రథమేశ్ కుమార్ తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం పట్ల దర్యాప్తు చేపట్టామని, త్వరలో చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఆ బిల్డింగ్‌లో ఉన్న యానిమేషన్ సెంటర్‌లో కోర్సులు నేర్చుకునేందుకు భారీ సంఖ్యలో విద్యార్థులు వస్తుంటారు. అగ్నిప్రమాద ఘటనపై దర్యాప్తు చేపట్టేందుకు ప్రభుత్వ ఏర్పాటు చేసిన సిట్ బృందం ఇవాళ ఉదయం ఆ ప్రదేశానికి చేరుకున్నది.సీఎం యోగి ఆదేశాల మేరకు సిట్ బృందం దర్యాప్తు చేపడుతోంది. ఫోరెన్సిక్ ల్యాబ్‌కు చెందిన ఆరు మంది సిబ్బంది ఇవాళ ఆ బిల్డింగ్ వద్ద ఆధారాలు సేకరించారు. అగ్నిప్రమాదం దేని వల్ల జరిగిందో, బాధ్యులు ఎవరో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

## సీయూఈటీ యూజీ ఫలితాలు విడుదల

**న్యూఢిల్లీ, జూన్ 23 జర్నలిస్టు డైరీ**
దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక కేంద్ర విశ్వవిద్యాలయాలు, ఇతర ప్రముఖ విద్యా సంస్థల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం





నిర్వహించిన 'సీయూఈటీ యూజీ-2026' ఫలితాలు విడుదలయ్యాయి. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) మంగళవారం ప్రవేశ పరీక్షల ఫలితాల్ని విడుదల చేసింది.పరీక్షకు హాజరైన లక్షలాది మంది విద్యార్థులు తమ స్కోర్‌కార్డులను అధికారిక పోర్టల్ ఎబవ్.ఞు.అఌఎ.అఅ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

# అమర్‌నాథ్ యాత్రికులకు ఇన్సూరెన్స్ పెంపు..

- యాత్రికులకు అందే సేవలపై కీలక

**న్యూఢిల్లీ,జూన్ 23 జర్నలిస్టు డైరీ**
పరమశివుడి భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అమర్‌నాథ్ యాత్ర 2026కు సర్వం సిద్ధమవుతోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జమ్మూ కాశ్మీర్‌లోని ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేస్తోంది. జూలై 3న ఈ యాత్ర ప్రారంభమై, ఆగష్టు 28న ముగియనుంది. ఈ సందర్భంగా యాత్రికులకు, పర్యాటకులకు, అక్కడి సాధారణ ప్రజలకు కూడా స్థానిక అధికారులు ట్రాఫిక్ సహా, ఆరోగ్యం వంటి అంశాల్లో కొన్ని సూచనలు చేశారు. ముఖ్యంగా అమర్‌నాథ్ యాత్రికులు ఈ సూచనలను తప్పకుండా తెలుసుకోవాలి.యాత్రికుల రక్షణ, భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ ఎక్కువగా ఉండే కొన్ని మార్గాల్లో నిర్దిష్ట సమయం వరకు భక్తులను అనుమతించబోరు.



నవయుగ టన్నెల్‌ను మూసేస్తారు. కాశ్మీర్ నుంచి జమ్మూ వచ్చే వాహనాలను ఉదయం 11.30 గంటల వరకు అనుమతించారు. అలాగే, జమ్మూ నుంచి కాశ్మీర్ వెళ్లే వాహనాలను మధ్యాహ్నం 3.00 తర్వాత అనుమతించరు. అలాగే, మరికొన్ని రూట్లలో కూడా నిర్దిష్ట సమయాల్లో ట్రాఫిక్ ఆపేయడం చేస్తారు. బల్తాల్, పహల్గాం మార్గాల్లో వెళ్లే ప్రయాణికుల భద్రత కోసం వసతి, భద్రత, ఆహారం, వైద్య సదుపాయాల్ని ఏర్పాటు చేశారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న యాత్రికులకు శ్రీ అమర్‌నాథ్‌జీ దేవస్థాన బోర్డు ఇన్సూరెన్స్ కవరేజ్‌ను పెంచింది. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ప్రత్యేకంగా ప్రీమియం లేదా ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. రిజిస్ట్రేషన్ చేసుకున్న యాత్రికులతోపాటు దేవస్థాన సిబ్బంది, అక్కడ పని చేసే కార్మికులు, అధికారులకు ఉచితంగానే వర్తిస్తుంది. యాత్ర మార్గంలో రెండు ప్రత్యేక ఆస్పత్రుల్ని ఏర్పాటు చేశారు. పూర్తి సామగ్రితో ఇవి పని చేస్తాయి. ఇందులో 70 వరకు బెడ్లు, 100 అంబులెన్సులు, 1,000 మంది వరకు సిబ్బంది అందుబాటులో ఉంటాయి. నిర్దిష్ట సమయానికి ముందుగానే భక్తులు కాశ్మీర్ చేరుకోవాలని బోర్డు సూచించింది. ఈ యాత్ర కోసం భారీ స్థాయిలో భద్రతా సిబ్బంది పని చేయనున్నారు. స్థానిక పోలీసులతోపాటు కేంద్ర బలగాలు కూడా భద్రతా సేవల్లో పాల్గొంటాయి.

# ఇరాన్ చమురుపై ఆంక్షలు ఎత్తేసిన అమెరికా..

ఇరాన్ చమురును ఇండియా కొంటుందా..?

**న్యూఢిల్లీ, జూన్ 23 జర్నలిస్టు డైరీ**
ఇరాన్ చమురుపై ఎన్నో ఏళ్లుగా విధించిన ఆంక్షల్ని అమెరికా తాజాగా ఎత్తివేసింది. తాజాగా ఇరు దేశాల మధ్య శాంతి చర్చల అనంతరం కుదిరిన ఒప్పందంలో భాగంగా 60 రోజులపాటు ఇరాన్ చమురుపై ఆంక్షల్ని అమెరికా తొలగించింది. అయితే, ఇప్పుడు ఇరాన్ నుంచి ఇండియా చమురు కొంటుందా అనే చర్చ జరుగుతోంది. ఇరాన్ చమురుపై అమెరికా చాలా ఏళ్లుగా ఆంక్షలు విధించింది. మధ్యలో కొన్నిసార్లు తొలగించినప్పటికీ.. చివరగా 2018 నుంచి ఆంక్షలు కొనసాగుతున్నాయి. అంటే, ఇరాన్ చమురును ఏ దేశాలూ కొనకూడదు. ఒకవేళ కంటే ఆ దేశాలపై అమెరికా కక్షసాధింపు చర్యలకు దిగుతుంది.అంటే, ఇరాన్ చమురు కొన్న దేశాల ఉత్పత్తులపై అమెరికా ఎక్కువ పన్నులు, వాణిజ్య పరమైన ఆంక్షలు విధిస్తుంది. దీంతో అమెరికాతో వైరం ఎందుకు అనుకున్న ఇండియా ఇరాన్ చమురును కొనుగోలు చేయడం లేదు. అయినప్పటికీ ఇరాన్, ఇండియా



మధ్య ఇతర వాణిజ్యం కొనసాగుతోంది. ఇరాన్ నుంచి గతంలో ఇండియాతోపాటు జపాన్, దక్షిణ కొరియా, ఇటలీ, టర్కీ, గ్రీస్, తైవాన్ దేశాలు ఎక్కువగా చమురు కొనేవి. ఇప్పుడు ఆ దేశాలకు కూడా ఇరాన్ చమురు సరఫరా చేసే అవకాశం ఉంది. ఇరాన్ చమురును అత్యధికంగా ఇంతకాలం కొన్నది మాత్రం చైనానే. అమెరికా ఆంక్షల్ని లెక్కచేయకుండా ఆ దేశం ఇరాన్ చమురు కొనుగోలు చేసింది. ఇక, చాలా ఏళ్లుగా ఇరాన్ నుంచి ఇండియా ఆయిల్ కొనడం లేదు. సాధారణంగా ఆంక్షలు ఉన్న దేశాల నుంచి ఇండియా చమురు కొనుగోలు చేయదు. అయితే, ఇప్పుడు ఇరాన్ చమురును ఇండియా కొనుగోలు చేసే అవకాశాలున్నాయని విశ్లేషకుల అంచనా. దీనికి కారణం.. ఇతర దేశాలతో పోలిస్తే ఇరాన్.. ఇండియాకు చాలా దగ్గరగా ఉంటుంది. అక్కడినుంచి రెండు లేదా మూడు రోజుల్లోనే చమురు నౌకలు ఇండియా చేరుకుంటాయి. దీంతో మన కంపెనీలకు త్వరగా చమురు సరిపడినంత అందుతుంది. పైగా, ప్రస్తుత ఆంక్షల సడలింపు 60 రోజులు మాత్రమే. అంటే, ఆ లోపే ఇతర దేశాలకు ఇరాన్ చమురును అమ్మేసుకోవాలి. అందువల్ల అవసరమైతే ఆయా దేశాలకు తక్కువ ధరకే చమురు సరఫరా చేసే అవకాశాలున్నాయి. దీంతో ఇండియన్ ఆయిల్ రిఫైనరీ కంపెనీలు.. ఇరాన్ కంపెనీలతో బేరమాడి తక్కువ ధరకే చమురు కొనుగోలు చేయవచ్చు. ఇరాన్ కూడా తక్కువ ధరకైనా సరే వీలైనంత చమురును అమ్మేసుకుని లబ్ధి పొందాలని చూస్తోంది. ఇది ఇండియాకు లాభించే అవకాశం ఉంది. ఇక, ఇప్పటికే ఇరాన్ చమురు నౌకలు కొన్ని ఇండియా రిఫైనరీలకు తరలినట్లు సమాచారం.

# టెలిగ్రామ్ యాప్‌ను రిస్టోర్ చేసిన గూగుల్..

-మళ్లీ ప్రారంభమైన యాప్ సేవలు


**న్యూఢిల్లీ: జూన్ 23 జర్నలిస్టు డైరీ**
టెలిగ్రామ్ యాప్ మళ్లీ ప్రారంభమైంది. ఆ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్‌లో మళ్లీ రిస్టోర్ చేశారు. నీట్ యూజీ రీఎగ్జామ్ నేపథ్యంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం టెలిగ్రామ్ యాప్‌ను బ్యాన్ చేసిన విషయం తెలిసిందే. జూన్ 21వ తేదీన నీట్ పరీక్ష జరిగింది. అయితే జూన్ 22వ తేదీన వరకు ఆ యాప్‌ను బ్లాక్ చేశారు. ఇవాళ ఉదయం నుంచి కొందరు యూజర్లకు టెలిగ్రామ్ యాప్ అందుబాటులోకి వచ్చేసింది. గూగుల్ రిస్టోర్ చేయకముందే కొందరు దాన్ని వాడడం ప్రారంభించారు. కానీ యాపిల్ ఆప్ స్టోర్‌లో మాత్రం



ఇంకా డీలిస్టు కేటగిరీలోనే ఆ యాప్ ఉన్నట్లు తెలుస్తోంది. యాపిల్ సంస్థ దీనిపై స్పందించేందుకు నిరాకరించింది.టెలిగ్రామ్ యాప్ బ్యాన్ అంశంపై తాత్కాలిక నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం చెప్పింది. నీట్‌కు చెందిన ఫేక్ పేపర్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కారణంగా.. ముఖ్యంగా టెలిగ్రామ్ యాప్‌ను బ్యాన్ చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొన్న విషయం తెలిసిందే. జూన్ 3వ తేదీన టెలిగ్రామ్ ప్రతినిధులతో భేటీ నిర్వహించిన తర్వాత బ్యాన్ ప్రకటన చేశారు. టెలిగ్రామ్ యాప్‌తో పాటు అనుబంధ వెబ్ లింకులను కూడా బ్లాక్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వెబ్ వర్షన్‌ను కూడా ఆపేశారు. జూన్ 30వ తేదీ వరకు టెలిగ్రామ్ మెసేజ్ ఎడిటింగ్ ఆప్షన్‌ను కూడా బ్లాక్ చేసిన విషయం తెలిసిందే.

# హిమాచల్ ప్రదేశ్‌లో ట్రక్కుతో సహా కూలిన బ్రిడ్జి..

**న్యూఢిల్లీ, జూన్ 23 జర్నలిస్టు డైరీ**
హిమాచల్ ప్రదేశ్‌లో ఒక బ్రిడ్జి పేకముక్కలా కూలిపోయింది. ఈ ఘటన కిన్నౌర్ జిల్లాలోని, ఉర్ని ప్రాంతంలో మంగళవారం ఉదయం జరిగింది. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. బ్రిడ్జిపై నుంచి ఎప్పట్లాగే వాహనాలు వెళ్తున్నాయి. ముందుగా ఒక ట్రక్కు వెళ్లింది. అది అవతలివైపు చేరిన తర్వాత మరో ట్రక్కు బ్రిడ్జిపైనుంచి వెళ్లేందుకు ప్రయత్నించింది. అలా ఒకవైపు నుంచి ట్రక్కు మరోవైపు చేరుకునేలోపే ఆ బ్రిడ్జి పేకముక్కలా కూలిపోయింది.ట్రక్కు కూడా బ్రిడ్జితోపాటే లోయలో పడిపోయింది. అయితే, అదృష్టవశాత్తు ఆ ట్రక్కు డ్రైవర్‌కు ప్రాణహాని జరగలేదు. స్వల్ప గాయాలతోనే బయపడ్డాడు. ఈ



ఘటనలో ఇతరులు ఎవరూ కూడా గాయపడలేదు. సమాచారం అందుకున్న అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. బాధిత డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. తీవ్రమైన పేలుడు శబ్దంతో బ్రిడ్జి కూలిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో తాము తీవ్రంగా ఆందోళన చెందామన్నారు. బ్రిడ్జి కూలడంతో అధికారులు స్పందించారు. 24 గంటలపాటు ఈ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. ఈ బ్రిడ్జి కాజా, షిమ్లా జిల్లాలను కలుపుతుంది. ఇక్కడి లాహౌల్ స్పితిని, కిన్నౌర్ ప్రాంతాలకు ఈ బ్రిడ్జిమీదుగానే వెళ్లాలి. ఈ బ్రిడ్జి కూలడంతో దాదాపు మూడు జిల్లాలను కలిపే మార్గం లేకుండాపోయిందని అధికారులు తెలిపారు. అయితే, వాహనం అధిక లోడింగ్ కారణంగానే ఈ బ్రిడ్జి కూలిందని అధికారులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఓవర్ లోడ్ వాహనాలు వెళ్లకూడదనే సూచన అక్కడ ఉందని అధికారులు అంటున్నారు. దీనిపై దర్యాప్తు జరుపుతున్నారు.

# కేంద్ర మంత్రి పదవికి జార్జి కురియన్ రాజీనామా

**హైదరాబాద్ జూన్ 23 జర్నలిస్టు డైరీ**
కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజ్యసభ సభ్యత్వ పదవీ కాలం ముగియడం, ఈసారి బీజేపీ అధిష్ఠానం ఆయనను తిరిగి నామినేట్ చేయకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. జార్జి కురియన్ సమర్పించిన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



ఆమోదించారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి భవన్ వర్గాలు ధ్రువీకరించాయి. ఇప్పటివరకు మోదీ క్యాబినెట్‌లో ఆయన మైనార్టీ వ్యవహారాల శాఖతో పాటు.. మత్స్య, పాడి, పశుపోషణ శాఖలకు కూడా సహాయ మంత్రి హోదాలో బాధ్యతలు నిర్వహించారు. జార్జి కురియన్ రాజ్యసభ ఎంపీ పదవీ కాలం గత ఆదివారం అంటే జూన్ 21న ముగిసింది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# ఎల్ నినో: కరువుకు సంకేతమా?

భూమి వాతావరణ వ్యవస్థలో అత్యంత ప్రభావవంతమైన సహజ ప్రక్రియలలో ఎల్ నినో (జుశ్రీ చీఆశీ) ఒకటి. ఇది కేవలం సముద్ర జలాల ఉష్ణోగ్రత మార్పు మాత్రమే కాదు; ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం, వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థ, ఆహార భద్రత, ప్రజల జీవన విధానాలను ప్రభావితం చేసే సంక్లిష్ట వాతావరణ దృగ్విషయం. భారతదేశం వంటి వ్యవసాయ ఆధారిత దేశానికి ఎల్ నినో ఒక హెచ్చరిక గంట వంటిది. ఎందుకంటే భారత ఆర్థిక వ్యవస్థలో ఇప్పటికీ వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుండగా, వ్యవసాయం ప్రధానంగా రుతుపవనాలపై ఆధారపడి ఉంది."ఎల్ నినో" అనే పదం స్పానిష్ భాష నుంచి వచ్చింది. దీని అర్థం "చిన్న బాలుడు" లేదా "క్రీస్తు శిశువు". దక్షిణ అమెరికాలోని పెరూ, ఈక్వడార్ తీర ప్రాంత మత్స్యకారులు క్రిస్మస్ సమయంలో సముద్ర జలాలు అసాధారణంగా వేడెక్కడాన్ని గమనించి దీనికి ఈ పేరు పెట్టారు. సాధారణ పరిస్థితుల్లో పసిఫిక్ మహాసముద్రం తూర్పు భాగంలో చల్లని నీరు, పశ్చిమ భాగంలో వేడి నీరు ఉంటుంది. కానీ ఎల్ నినో సమయంలో ఈ సమతుల్యత దెబ్బతింటుంది. తూర్పు పసిఫిక్‌లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 0.5 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే ఎక్కువ పెరుగుతాయి. దీని ఫలితంగా ప్రపంచ వాతావరణ చక్రాలు మారిపోతాయి.భారతదేశానికి అత్యంత కీలకమైన అంశం నైరుతి రుతుపవనాలు. ఇవి దేశ వార్షిక వర్షపాతంలో దాదాపు 70 శాతం అందిస్తాయి. ఎల్ నినో ప్రభావం వల్ల భారతదేశంలో రుతుపవనాల బలం తగ్గుతుంది. ఫలితంగా వర్షపాతం లోపం, కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం పెరుగుతుంది. అయితే ప్రతి ఎల్ నినో సంవత్సరం తప్పనిసరిగా కరువుకు దారితీయదు. కానీ గణాంకాలు చూస్తే ఎల్ నినో సంవత్సరాలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

భారతదేశ చరిత్రలో ఎల్ నినో ప్రభావం అనేకసార్లు కనిపించింది. 1982-83, 1987, 2002, 2009, 2015-16 సంవత్సరాలు ముఖ్య ఉదాహరణలు. 2002లో దేశవ్యాప్తంగా వర్షపాతం దాదాపు 19 శాతం తగ్గింది. వ్యవసాయ ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. 2009లో కూడా తీవ్రమైన వర్షాభావం కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. 2015-16లో ఎల్ నినో ప్రభావంతో వరుసగా రెండో ఏడాది కూడా



అనేక రాష్ట్రాలు కరువును ఎదుర్కొన్నాయి. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలు తీవ్ర ప్రభావానికి గురయ్యాయి.

ఎల్ నినో ప్రభావం కేవలం వ్యవసాయ రంగానికే పరిమితం కాదు. ఇది భారత ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని ప్రభావితం చేస్తుంది. పంట దిగుబడులు తగ్గితే రైతుల ఆదాయం తగ్గుతుంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గడంతో ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం (ఇన్ఫ్లేషన్) పెరుగుతుంది. ముఖ్యంగా బియ్యం, గోధుమలు, పప్పుధాన్యాలు, కూరగాయలు, పండ్ల ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. దీనివల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతుంది.వ్యవసాయ ఉత్పత్తి తగ్గడం వల్ల గ్రామీణ వినియోగం కూడా తగ్గుతుంది. ట్రాక్టర్లు, ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ యంత్రాల విక్రయాలు పడిపోతాయి. గ్రామీణ మార్కెట్లు మందగిస్తాయి. దీని ప్రభావం తయారీ రంగం, సేవారంగంపైనా పడుతుంది. అంతేకాకుండా నీటి కొరత వల్ల జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే ప్రమాదం ఉంటుంది. విద్యుత్ సంక్షోభం కూడా తలెత్తవచ్చు.వాతావరణ శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం భూతాపం (గ్లోబల్ వార్మింగ్) పెరుగుతున్న కొద్దీ ఎల్ నినో సంఘటనలు మరింత తీవ్రంగా మారే అవకాశం ఉంది. సముద్రాల ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వాతావరణ అస్థిరత కూడా పెరుగుతోంది. అంటే భవిష్యత్తులో కరువు, వరదలు, తుఫాన్లు వంటి తీవ్ర వాతావరణ ఘటనలు మరింత తరచుగా సంభవించే అవకాశం ఉందని అనేక పరిశోధనలు సూచిస్తున్నాయి.ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు చర్యలు తీసుకోవడం అత్యవసరం. మొదటగా, వాతావరణ అంచనాలను గ్రామ స్థాయికి చేరవేయాలి. రైతులకు సమయానుకూల సమాచారం అందించాలి. వర్షాభావ పరిస్థితులకు తట్టుకునే పంటలను ప్రోత్సహించాలి. తక్కువ నీటితో సాగు అయ్యే చిరుధాన్యాలు, పప్పుధాన్యాల సాగును పెంచాలి. భూగర్భ జలాల వినియోగంపై నియంత్రణ అవసరం.నీటి నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. చెరువులు, కుంటలు, కాలువలు పునరుద్ధరించాలి. వర్షపు నీటి సంరక్షణ కార్యక్రమాలను విస్తరించాలి. సూక్ష్మ సాగు పద్ధతులు, డ్రిప్, స్ప్రింక్లర్ వ్యవస్థలను పెద్ద ఎత్తున అమలు చేయాలి. ప్రతి జిల్లాకు ప్రత్యేక కరువు నిర్వహణ ప్రణాళిక ఉండాలి.ఆహార భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం తగిన నిల్వలను సిద్ధంగా ఉంచాలి. ధరల పెరుగుదలను నియంత్రించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. పంట బీమా పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. కరువు ప్రభావిత ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకాలను విస్తరించి గ్రామీణ ప్రజలకు ఆదాయం కల్పించాలి.

ప్రజల పాత్ర కూడా కీలకమే. నీటిని పొదుపుగా వినియోగించడం, వర్షపు నీటి సంరక్షణ చేపట్టడం, భూగర్భ జలాల దుర్వినియోగాన్ని తగ్గించడం అవసరం. రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి పంటల వైవిధ్యీకరణ చేయాలి. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతులను మార్చుకోవాలి. ఎల్ నినోను పూర్తిగా నివారించడం మన చేతిలో లేదు. కానీ దాని ప్రభావాన్ని తగ్గించడం మాత్రం సాధ్యమే. శాస్త్రీయ అంచనాలు, సమర్థవంతమైన పాలన, నీటి వనరుల సంరక్షణ, రైతుల అవగాహన, ప్రజల భాగస్వామ్యం కలిస్తే ఈ ప్రకృతి సవాలును ఎదుర్కోవచ్చు. ఎల్ నినో ఒక సహజ ప్రక్రియ అయినప్పటికీ, దాన్ని విపత్తుగా మారనివ్వాలా లేక ముందస్తు సంసిద్ధతతో ప్రభావాన్ని తగ్గించాలా అనేది సమాజం, ప్రభుత్వాల నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. వాతావరణ మార్పుల యుగంలో ఎల్ నినో మనకు ప్రకృతితో సమతుల్యంగా జీవించడం ఎంత అవసరమో గుర్తుచేసే ఒక హెచ్చరికగా నిలుస్తోంది.

**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.**
ramkishore.1504@gmail.com

# వర్షాకాల అప్రమత్తతపై వాగుల పరిశీలన

**-వర్షాకాల భద్రతపై రావిర్యాల, గుర్రంపల్లి వాగుల పరిశీలన**
**-వాగులు దాటొద్దని ప్రజలకు సూచించిన అధికారులు, ప్రజాప్రతినిధులు**
**-రావిర్యాల, గుర్రంపల్లి వాగులను సందర్శించిన అధికారులు, ప్రజాప్రతినిధులు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 23 (జర్నలిస్ట్ డైరీ) :** వర్షాకాలం నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లేడు చౌదరిగూడ మండలంలోని రావిర్యాల వాగు, గుర్రంపల్లి వాగులను మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి పరిశీలించారు. వర్షాల సమయంలో వాగులు ఉప్పొంగే పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు, ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, భారీ వర్షాల వల్ల అకస్మాత్తుగా వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాగులు ప్రవహిస్తున్న సమయంలో వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని హెచ్చరించారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోందని తెలిపారు.ప్రమాదకర రహదారులు, వాగు దాటే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ మార్గాల వినియోగంపై పోలీసు, రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు చర్చించారు. వర్షాల సమయంలో ఎలాంటి సందేహాలు లేదా అత్యవసర పరిస్థితులు తలెత్తినా పోలీసు శాఖ, మండల అధికారులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై విజయ్, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీఓ హన్మంతరెడ్డి, ఏఈ నర్సింలు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్, సర్పంచ్‌లు రాంచంద్రయ్య, జంగయ్య, నాయకులు పి. యాదయ్య, ఆంజనేయులు, వెంకటనర్సింహారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, కుమార్, సలీమ్, రజిత తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన ఎల్వోసీ పత్రాన్ని అందించిన గాంధీ

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 23 (జర్నలిస్ట్ డైరీ) :** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని నెహ్రూ నగర్ కాలనీ కి చెందిన నుస్రత్ జాన్ కి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 2,50,000/- రెండు లక్షల యాభై వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన ఎల్వోసీ మంజూరి పత్రాన్ని తాజా మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి బాధిత కుటుంబానికి అందచేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని నెహ్రూ నగర్ కాలనీ కి చెందిన నుస్రత్ జాన్ కి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి ఎల్వోసీ ద్వారా మంజూరైన 2,50,000/- రెండు లక్షల యాభై వేల రూపాయలు మంజూరి అయినవి అని



తెలియచేసారు.ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు . అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్తోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని ఈ సందర్భంగా తెలియచేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు మిరియాల ప్రీతమ్ ,శ్రీనివాస్ రెడ్డి, మోజేష్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి,డ్రగ్స్ నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

**-కల్తీ మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా అవసరం**
**-ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎక్సైజ్ శాఖ పనిచేయాలి**
**-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 23 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎక్సైజ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ ఎక్సైజ్ శాఖ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ శ్రీనివాస్‌తో పాటు శాఖ సిబ్బంది హాజరయ్యారు. సమావేశంలో గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా మరియు విక్రయాలపై కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అలాగే కల్తీ మద్యం తయారీ, నిల్వలు, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అక్రమ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు.ఎక్సైజ్ శాఖ విధులు నిర్వర్తించే సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, ప్రజల భద్రత మరియు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.అక్రమ మాదకద్రవ్యాలు, కల్తీ మద్యం నిర్మూలనలో ఎక్సైజ్ శాఖ మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు.


# ఇబ్రహీంపట్నం ఆర్డీవోకి శుభాకాంక్షలు తెలిపిన కొత్తపల్లి యువ నాయకులు



**యాచారం (జూన్ 24) జర్నలిస్ట్ డైరీ.** ఇబ్రహీంపట్నం నూతన ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ రెడ్డి ని మంగళవారం నాడు కొత్తపల్లి గ్రామ యువ నాయకులు,పలువురు ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా యువ నాయకుడు చిక్కుడు శేఖర్, వార్డు సభ్యులు వంగ సంజీవ రెడ్డి, సోమరాజు అరవింద్, చిక్కుడు వెంకటేష్, సోమరాజు వెంకటరమణ, గౌని వెంకటేశ్ తదితరులు ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి ని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.కొత్తపల్లి గ్రామ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని గ్రామ నాయకులు హామీ ఇచ్చారు.

# సభ్యత్వ నమోదు,సర్‌తో పార్టీని మరింత బలోపేతం చేయాలి

**-బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
**-కేటీఆర్‌ను కలుసుకున్న వై. రవీందర్ యాదవ్, మురళీకృష్ణ యాదవ్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 23 (జర్నలిస్ట్ డైరీ) :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా నాయకులు కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో షాద్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు వై. రవీందర్ యాదవ్, మురళీకృష్ణ యాదవ్ మర్యాదపూర్వకంగా కేటీఆర్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, కార్యకలాపాలపై కేటీఆర్ వారితో చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమవుతోందని ప్రజలకు వివరించడంతో పాటు క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి పూర్తిస్థాయిలో కృషి చేయాలని నాయకులకు సూచించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఓటర్ల జాబితా మార్పులు, పార్టీ విస్తరణ తదితర అంశాలపై అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ మరింత బలంగా ప్రజల్లోకి వెళ్తుందని, కార్యకర్తలు ప్రజల మధ్య నిరంతరం ఉండాలని కేటీఆర్ దిశానిర్దేశం చేసినట్లు నాయకులు తెలిపారు.అనంతరం మురళీకృష్ణ యాదవ్ కేటీఆర్‌తో సెల్ఫీ దిగగా, ఆ ఫోటోను మీడియాతో పంచుకున్నారు.

ఈ సందర్భంగా వై. రవీందర్ యాదవ్ మాట్లాడుతూ, కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకోవడం జరిగిందని, పార్టీ పటిష్టత కోసం ఆయన ఇచ్చిన సూచనలు, సలహాలను ఖచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు.

# శ్రీనివాసులగూడలో హైమాస్ట్ లైట్ ప్రారంభోత్సవం

**ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సొంత నిధులతో హైమాస్ట్ లైట్ ఏర్పాటు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 23 (జర్నలిస్ట్ డైరీ) :** నందిగామ మండలం శ్రీనివాసులగూడ గ్రామంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌ను ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. గ్రామంలో రాత్రి వేళల్లో మెరుగైన వెలుతురు అందించాలనే ఉద్దేశంతో ఈ హైమాస్ట్ లైట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవంలో శ్రీనివాసులగూడ సర్పంచ్ కుమ్మరి పద్మమ్మ కృష్ణయ్య,మొదల్లగూడ సర్పంచ్ అరుణ రాజు,మామిడిపల్లి సర్పంచ్ హనుమంత్ రెడ్డి,ఈదులపల్లి సర్పంచ్ సులోచన గణేష్ గౌడ్, శ్రీనివాసులగూడ మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి,మామిడిపల్లి మాజీ ఎంపిటిసి కాట్న మాదవి రవీందర్,ఉపసర్పంచులు మొదల్లగూడ విక్రమ్ రెడ్డి,మామిడిపల్లి రాజు,ఈదులపల్లి సంధ్య శేఖర్,మాజీ ఉపసర్పంచ్ సత్యనారాయణ,వార్డు మెంబర్లు బిఆర్ఎస్ నాయకులు,గ్రామ పెద్దలు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అమరవీరుల స్థూపం పనులను పరిశీలించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**-త్వరలో అమరవీరుల స్థూపం ఆవిష్కరణ**

**-పచ్చదనం, సందర్శకుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 23 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్‌నగర్‌లో నిర్మిస్తున్న తెలంగాణ అమరవీరుల స్థూపం నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంగళవారం మరోసారి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఆయన, స్తూపం పరిసరాలను మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. స్థూపం నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించిన ఎమ్మెల్యే, పరిసర ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించేలా పూల మొక్కలు, నీడనిచ్చే చెట్లను విస్తృతంగా నాటాలని ఆదేశించారు. సందర్శకుల సౌకర్యార్థం సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయాలని కూడా డైరెక్టర్ కరుణాకర్ కు సూచించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ టి. కరుణాకర్, దళిత సంఘం నాయకుడు బాదేపల్లి సిద్ధార్థ, యువ నాయకులు ముబారక్ అలీ ఖాన్, తుపాకుల శేఖర్, గోరి తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు. కాగా, త్వరలో తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నేపథ్యంలో పూర్తి చేయాల్సిన పనులపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి అధికారులకు, నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు.

# బాధిత కుటుంబాలకు రాష్ట్ర నాయకులు నాయకులుపాశం గోపాల్ రెడ్డి ఆర్థిక సహాయం



**గుర్రంపోడు, జూన్ 23(జర్నలిస్ట్ డైరీ) :** గుర్రంపోడు మండలంలోమండల పరిధిలోని నడికూడ మరియు బొల్లారం గ్రామాలలో రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాల వల్ల ఇబ్బందులు పడుతున్న, పలు బాధిత కుటుంబాలను ఆయన ప్రత్యక్షంగా కలిసిపరామర్శించారు. వారి కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకుని, అధైర్యపడొద్దని, అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం మానవతా దృక్పథంతో ఆయా కుటుంబాలకు తక్షణ ఉపశమనం కోసం తన సొంత నిధుల నుండి నగదు రూపంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు కష్టం వస్తే ఆదుకోవడానికి తాము ఎల్లప్పుడూ ముందుంటామని భరోసా ఇచ్చారు. స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ పరామర్శ మరియు ఆర్థిక సహాయ పంపిణీ కార్యక్రమంలో మునుకుంట్ల రాజేష్ రెడ్డి, ఐతేగోని కృష్ణ గౌడ్, వేముల యాదయ్య, పాశం రామ్ నర్సింహారెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ పానుగుండ్ల వెంకన్న గౌడ్, కొక్కు రామకృష్ణ, కలకొండ అంజయ్య, కలకొండ శంకర్, కలకొండ సైదులు, శీను గౌడ్, ఐతరాజు యాదమ్మ, లింగమ్మ, తరి రమేష్, జ్యోతి మరియు స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరస్వామి అన్నప్రసాదం ట్రస్ట్‌కి విరాళం

## 3 లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చిన బంగ్లా శ్రేష్ఠారెడ్డి తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్న కూతురు



బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి కుటుంబ సభ్యులు



**మిడ్జిల్, జూన్ 22,(జర్నలిస్ట్ డైరీ) :** బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి కుమార్తె నర్వ గ్రామానికి చెందిన కుమారి బంగ్లా శ్రేష్ఠా రెడ్డి హైదరాబాద్ లోని జె.ఎన్.టి.యు యూనివర్సిటీలో సివిల్ ఇంజినీరింగ్ లో ఎంటెక్ పూర్తి చేసి,క్యాంపస్ ఇంటర్వ్యూ ద్వారా వచ్చిన ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ, మొదటి మూడు నెలల శాలరీని టీటీడీ దేవస్థానంకి విరాళంగా ఇస్తానని మొక్కుకున్న బంగ్ల శ్రేష్ఠా రెడ్డి మంగళవారం రోజు తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ కి ఈవో, టీటీడీ,తిరుమల పేరుమీద Rs.3,00,000/- రూపాయలను విరాళంగా ఇచ్చి మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భముగా బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకొని, తిరుమల శ్రీ అలివేలు మంగ, పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో అన్నదానం ట్రస్ట్ కి విరాళం ఇచ్చిన శ్రేష్ఠా రెడ్డి తన మొక్కుని తీర్చుకోవడం గొప్ప వరంగా భావిస్తున్నామని, అదేవిదంగా మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి డీకే అరుణమ్మ కి భారత ప్రధాని శ్రీ నరేంద్రమోడీ గారి ఆధ్వర్యంలో త్వరలో జరుగబోయే కేంద్ర మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కేలా ఆశీర్వదించాలని ఆ అఖిలాండకోటి బ్రమ్మాండ నాయకులని వేడుకొన్నారు.

# ప్రజారోగ్య పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

**- కమిషనర్ బి. శరత్ చంద్ర**




**నల్లగొండ జూన్ 23 (జర్నలిస్ట్ డైరీ) :** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజారోగ్య పరిరక్షణ, పారిశుద్ధ్య నిర్వహణ, అంటువ్యాధుల నివారణ, ఇందిరమ్మ ఇండ్ల అమలు, ఆస్తి పన్ను వసూళ్లు, మౌలిక వసతుల అభివృద్ధి తదితర అంశాలపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరం లో డెంగ్యూ, మలేరియా, కలరా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. ప్రతి వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తూ, దోమల వ్యాప్తికి కారణమయ్యే నిల్వ నీటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రజల్లో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. వార్డ్ ఆఫీసర్లు, జవాన్లు, రిసోర్స్ పర్సన్స్, శానిటేషన్ సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తూ కాలనీలు, డివిజన్లలో పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, ఎక్కడైనా నీరు నిల్వ ఉన్నా లేదా పారిశుద్ధ్య సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత లబ్ధిదారుల ఎంపిక, ధృవీకరణ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన పేదలకు గృహాలు అందేలా చర్యలు చేపట్టాలని వార్డ్ ఆఫీసర్లకు సూచించారు. అలాగే గతంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లలో అవసరమైన మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలో సుమారు రూ.32 కోట్ల మేర ఉన్న ఆస్తి పన్ను బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ తెలిపారు. పట్టణ అభివృద్ధికి అవసరమైన రోడ్లు, డ్రైన్లు, తాగునీటి పైప్‌లైన్లు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. టి.యు.ఎఫ్.ఐ.డిసి నిధులతో చేపడుతున్న పనులను వేగవంతం చేయడంతో పాటు, కొత్తగా మంజూరైన ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

నగరంలో అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు టౌన్ ప్లానింగ్ విభాగం కఠినంగా వ్యవహరించాలని, ఎల్ఆర్ఎస్‌కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇకపై వారానికొకసారి జరిగే సాధారణ సమీక్షలతో పాటు శాఖల వారీగా ప్రత్యేక సమీక్షలు నిర్వహించి, పెండింగ్ పనులపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కమిషనర్ తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వర్షాకాలం లో ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ వ్యర్థాలు, హానికర వ్యర్థాలను విడివిడిగా మున్సిపల్ వాహనాలకు అందించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స కోసం ఖర్చు చేయడం కంటే ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ పి. వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. మనోహర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణవేణి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. అశోక్, అసిస్టెంట్ ఇంజనీర్లు దిలీప్, ప్రవీణ్, అసీం బాబా, శానిటరీ సూపర్వైజర్ జి. శ్రీనివాస్, మేనేజర్ కళ్యాణి, రెవెన్యూ అధికారి శివరాం రెడ్డి, వార్డ్ ఆఫీసర్లు, సెక్షన్ క్లర్కులు ఇతర అధికారులు పాల్గొన్నారు .

# రెండవసారి ఎన్నికైన నాంపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి కి ఘన సత్కారం




**మునుగోడు , జూన్ 23: (జర్నలిస్ట్ డైరీ) :** నాంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మండల వ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది. ఈ నియామకాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షల వెల్లువ కురిపించారు. పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు అండగా నిలవడంలో ఆయన చేసిన విశేష కృషిని గుర్తించే అధిష్టానం రెండోసారి బాధ్యతలు అప్పగించిందని ఈ సందర్భంగా నాయకులుకొనియాడారు. అనంతరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడిని నాయకులు, ప్రజాప్రతినిధులు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. రాబోయే రోజుల్లో కూడా అందరినీ కలుపుకొని పోతూ, మండలంలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తీగా ఎదగడానికి ఆయన మరింత కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ అభినందన మరియు సత్కార కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య, ముష్టిపల్లి గ్రామ సర్పంచ్ జక్కుల మంజుల మల్లయ్య యాదవ్, మాజీ ఉపసర్పంచ్ గిరి వెంకటేశ్వర్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు జినుకల దుర్గయ్య ప్రత్యేకంగా పాల్గొన్నారు. వీరితో పాటు తుమ్మలపల్లి ప్రతినిధులు ఆ కిటి మహేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కందికట్ల వెంకటేష్ మరియు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, ఉత్సాహవంతులైన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన అధ్యక్షునికి తమ పూర్తి మద్దతును, అభినందనలను తెలియజేశారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

## శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**నాగోల్, జూన్ 23 (జర్నలిస్ట్ డైరీ) :** నాగోల్ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, గొప్ప జాతీయవాది, విద్యావేత్త మరియు దేశ సమైక్యత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చింతల సురేందర్ యాదవ్ నాగోల్ డివిజన్ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వారి సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత, జాతీయ సమగ్రత కోసం చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. "ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, రెండు ప్రధానులు ఉండకూడదు" అనే సిద్ధాంతంతో పోరాడి దేశ సమగ్రత కోసం తన ప్రాణాలను అర్పించిన మహానేతగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధి, జాతీయత భావాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ త్యాగాలు, సేవలు భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కేసిరెడ్డి పద్మ రెడ్డి, బీజేపీ నాయకులు బద్దం బాలకృష్ణ, వస్పరి మల్లేష్, సంజీవరెడ్డి, వినోద్ రెడ్డి, పంగ శ్యామ్ కుమార్, శ్రీనివాస్, రావుల శ్రీనివాస్ గౌడ్, సాయి కుమారి, సరస్వతి, వినోద్ యాదవ్, నరేష్ యాదవ్, శివశంకర్, విజయశంకర్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేద, అనాథ చిన్నారులకు అల్పాహారం అందించిన కృష్ణగోపాల్ సేవా సమితి





**ఎల్.బి.నగర్, జూన్ 23 (జర్నలిస్ట్ డైరీ) :** కృష్ణగోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం పేద మరియు అనాథ చిన్నారుల పాఠశాలలో ప్రేమపూర్వకంగా ఉదయం అల్పాహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సమాజంలోని నిరుపేద చిన్నారులకు అండగా నిలుస్తూ వారి ఆకలి తీర్చేందుకు సమితి నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతోంది. ఈ సందర్భంగా కృష్ణ గోపాల్ సేవ సమితి అధ్యక్షులు డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, ప్రతి చిన్నారి సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలన్నదే తమ సమితి ప్రధాన లక్ష్యమని తెలిపారు. "ఒక్క అనాథ చిన్నారి కూడా ఆకలితో ఉండకూడదు. చిన్నారుల చిరునవ్వుల్లోనే భగవంతుని దర్శనం పొందగలమనే భావనతో ఈ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నాము" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవ సమితి అధ్యక్షులు డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్‌తో పాటు కృష్ణగోపాల్ సేవా సమితి అధికారులు, సభ్యులు పాల్గొని చిన్నారులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమం సందర్భంగా పిల్లల ఆనందం, వారి ముఖాల్లో కనిపించిన చిరునవ్వులు ప్రతి ఒక్కరినీ కదిలించాయి. "మానవ సేవే మాధవ సేవ" అనే సిద్ధాంతంతో కృష్ణగోపాల్ సేవా సమితి వివిధ సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి సేవలందిస్తూ ముందుకు సాగుతోంది. తమ పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవం లేదా ఇతర ప్రత్యేక సందర్భాలను అనాథ చిన్నారులతో కలిసి జరుపుకోవాలనుకునే వారు కృష్ణగోపాల్ సేవా సమితిని 8106876999 నంబర్‌లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

## రంగారెడ్డి అర్బన్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలుగా నియమితులైన కేశవరెడ్డి పద్మా రెడ్డి



**నాగోల్, జూన్23 (జర్నలిస్ట్ డైరీ) :** నాగోల్ డివిజన్ బిజెపి కార్యాలయంలో నూతనంగా రంగారెడ్డి అర్బన్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలుగా నియమితులైన కేశవరెడ్డి పద్మా రెడ్డిని బిజెపి సీనియర్ నాయకులు చింతల సురేంద్ర యాదవ్ శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ పట్ల అంకిత భావంతో పనిచేస్తూ మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్న కేశవరెడ్డి పద్మా రెడ్డికి ఈ బాధ్యతలు రావడం సంతోషకరమని అన్నారు. ఆమె నాయకత్వంలో మహిళా మోర్చా మరింత బలోపేతం అవుతుందని పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.





# డ్రగ్స్ రహిత తెలంగాణే మన అందరి ధ్యేయం

### కొండమల్లేపల్లి బాలికల సోషల్ వెల్ఫేర్ గురుకులంలో ఘనంగా అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవ సదస్సు

### ముఖ్య అతిథులుగా హాజరైన సీఐ నవీన్ కుమార్, నల్గొండ జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు యేకుల అనిత సురేష్

### అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పిలుపు



**కొండమల్లేపల్లి, జూన్ 23 (జర్నలిస్ట్ డైరీ) :** యువత మరియు విద్యార్థి లోకం మాదకద్రవ్యాల (డ్రగ్స్) వంటి మహమ్మారి బారిన పడకుండా, ఒక ఆరోగ్యకరమైన, సురక్షితమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. 'ఈగిల్ ఫోర్స్ తెలంగాణ' సౌజన్యంతో, జూన్ 26 అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని బాలికల సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల మరియు కళాశాలలో మంగళవారం ఒక భారీ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సీఐ నవీన్ కుమార్, నల్గొండ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు యేకుల అనిత సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి.. సమాచారం అందించాలి: సీఐ నవీన్ కుమార్‌లి

సీఐ నవీన్ కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజాన్ని పట్టి పీడిస్తున్న అతిపెద్ద విపత్తు డ్రగ్స్ అని, దీనికి విద్యార్థులు, యువత బానిసలై తమ బంగారు భవిష్యత్తును, జీవితాలను చేజేతులా నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.
మాదకద్రవ్యాల సరఫరా, అమ్మకాలు మరియు వినియోగంపై పోలీస్ శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు.
ముఖ్యంగా విద్యార్థినులు, మహిళలు ఈ విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. గురుకుల పాఠశాల, కళాశాల పరిసర ప్రాంతాలలో గానీ, లేదా మీ గ్రామాలు, నివాస ప్రాంతాలలో గానీ ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్నా, డ్రగ్స్ లేదా ఇతర మత్తుపదార్థాల విక్రయాలకు పాల్పడుతున్నట్టు తెలిసినా వెంటనే పోలీస్ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా డ్రగ్స్ సరఫరా చేసే లేదా వాడే వారి ప్రవర్తన, నడవడిక భిన్నంగా ఉంటాయని.. అలా ప్రవర్తించే వ్యక్తులు ఎవరైనా కనపడిన వెంటనే ఆలస్యం చేయకుండా పోలీసులకు తెలియజేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా రహస్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ఎక్కడైనా ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు గమనిస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 కి గానీ, లేదా స్థానిక పోలీసులకు గానీ ఫోన్ చేయాలని పిలుపునిచ్చారు.
డ్రగ్స్ రహిత సమాజం కోసం విద్యార్థులు నడుం బిగించాలి: యేకుల అనిత సురేష్‌లి
నల్గొండ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు యేకుల అనిత సురేష్ మాట్లాడుతూ.. "డ్రగ్స్ రహిత తెలంగాణే మన అందరి ధ్యేయం" కావాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశ అనేది ఎంతో విలువైనదని, ఈ సమయంలో చెడు అలవాట్లకు, ఆకర్షణలకు లోనుకాకుండా ఉన్నతమైన ఆలోచన వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల నిర్మూలన కేవలం పోలీసుల వల్లే సాధ్యం కాదని, సమాజంలోని ప్రతి పౌరుడు, ముఖ్యంగా విద్యార్థినులు ఇందులో భాగస్వాములు కావాలన్నారు. మీ పరిసరాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నా, యువతను తప్పుదోవ పట్టించేలా ప్రవర్తిస్తున్నా ధైర్యంగా ముందుకు వచ్చి ఉపాధ్యాయులకు లేదా పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. బాలికలు చదువుతో పాటు సమాజం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఇలాంటి అసాంఘిక శక్తులపై తిరగబడాలని ఆమె పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శౌరీలు, అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థినులందరితో కలిసి 'సే నో టు డ్రగ్స్' మరియు 'హ్యాపీ ఫ్యామిలీ' అంటూ , మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడుతామని ప్రతిజ్ఞ చేయించారు.

# గుర్రంపోడులో ఏబీవీపీ పాఠశాలల బంద్ విజయవంతం

### ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్



**గుర్రంపోడు, జూన్ 23 (జర్నలిస్ట్ డైరీ) :** ప్రభుత్వ పాఠశాల విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని, విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం గుర్రంపోడు మండల కేంద్రంలోని అన్ని పాఠశాలల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వెలుగు అమల మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల విద్య క్రమంగా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యా హక్కు చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇటీవల రాష్ట్రంలో వేలాది పాఠశాలలను విలీనం చేయడం లేదా మూసివేసే ప్రతిపాదనలు తీసుకురావడం వల్ల పేద, మధ్యతరగతి, దళిత, బహుజన, గిరిజన విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు.

**ప్రధాన డిమాండ్లు:**
రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎంఈఓ డీఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ప్రైవేట్ పాఠశాలల అధిక ఫీజుల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలి. జాతీయ విద్యా విధానం (NEP-2020) ని రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేయాలి. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడకుండా ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు యడవల్లి అజయ్, లాల్, నీతిన్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ దొంగిలించి ఖాతాలోని నగదు

# మాయం చేసిన సైబర్ నేరగాళ్లు

**నాగోల్, జూన్23 (జర్నలిస్ట్ డైరీ) :** కూరగాయల మార్కెట్‌లో మొబైల్ ఫోన్ చోరీకి గురైన ఓ రిటైర్డ్ ఉద్యోగి బ్యాంకు ఖాతా నుంచి రూ.1,04,600ను అక్రమంగా బదిలీ చేసిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగోల్ ఇన్‌స్పెక్టర్ ఎం.డి. మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ ఆనంద్‌నగర్‌కు చెందిన దేవళ్ల గోవర్ధన్ (64) రిటైర్డ్ ఉద్యోగి. ఈ నెల 7వ తేదీన ఆయన కూరగాయల మార్కెట్‌కు వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మొబైల్ ఫోన్‌ను చోరీ చేశారు. మరుసటి రోజు కొత్త మొబైల్ ద్వారా తన గ్రాష్ట్రశీఅవూవ ఖాతాను పరిశీలించగా, గుర్తు తెలియని వ్యక్తులు ఆయన అనుమతి లేకుండా ఏడు విడతల్లో మొత్తం రూ.1,04,600ను వివిధ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసినట్లు గుర్తించారు. దీంతో బాధితుడు వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేయడంతో పాటు నాగోల్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ ఎం.డి. మక్బూల్ జానీ తెలిపారు. ప్రజలు మొబైల్ ఫోన్లలో బ్యాంకింగ్, యూపీఐ, డిజిటల్ పేమెంట్ యాప్‌లను వినియోగించే సమయంలో భద్రతా జాగ్రత్తలు పాటించాలని, ఫోన్ పోయిన వెంటనే సిమ్ బ్లాక్ చేయించి సంబంధిత బ్యాంకులు, సైబర్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

# బిజినెస్

## స్టాక్ మార్కెట్లు భారీ పతనం..

– సెన్సెక్స్ 893 పాయింట్లు లాస్



భారతీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీగా పతనమయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 893 పాయింట్లు, నిఫ్టీ 278 పాయింట్లు నష్టపోయాయి. ఉదయం ట్రేడింగ్ 57 పాయింట్ల నష్టంతో 77,061 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. నిఫ్టీ కూడా 31 పాయింట్ల నష్టంతోనే ప్రారంభమైంది. ఉదయం నుంచి కొనసాగిన లాస్ ట్రెండ్ ట్రేడింగ్ ముగిసే వరకు కొనసాగింది.ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 893.39 పాయింట్లు (1.16 శాతం) నష్టపోయి 76,200.68 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 278.80 పాయింట్లు (1.16%) కోల్పోయి 23,824.10 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 94.74 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 77.49 డాలర్ల వద్ద కొనసాగింది. ఔన్స్ బంగారం ధర 4130 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్ఈ సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, పవర్ గ్రిడ్, మారుతీ సుజుకి షేర్లు లాభాలు పొందగా, ఐటీ స్టాక్స్ తీవ్రంగా నష్టపోయాయి. ఇన్ఫోసిస్ షేర్లు 3.36 శాతం, టీసీఎస్ 3.16 శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 1.79 శాతం, టెక్ మహీంద్రా 1.31 శాతం నష్టపోయాయి. అలాగే, బీఈఎల్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్ కూడా భారీగా నష్టపోయాయి. మెటల్ స్టాక్స్ కూడా నష్టాల్లోనే కొనసాగాయి. ఫార్మా షేర్లు మాత్రం స్వల్పంగా లాభాలు పొందాయి. ఇండియాతోపాటు జపాన్, ఇతర ఆసియా మార్కెట్లు, అంతర్జాతీయా మార్కెట్లు కూడా మంగళవారం నష్టాల్లోనే ముగిశాయి.

## ఫోన్‌లో నంబర్ సేవ్ చేయకుండానే వాట్సాప్‌లో మెసేజ్ పంపవచ్చు.. ఎట్లనో తెలుసా..!

మెసేజింగ్ సోషల్ మీడియా యాప్ వాట్సాప్ గురించి తెలియని వాళ్లు చాలా తక్కువ. స్మార్ట్ ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరు వాట్సాప్‌ను వినియోగిస్తారు. ఈ యాప్‌లో ఫోటోలు, వీడియోలతోపాటు కాల్స్ చేసుకొనే వెసులుబాటు కూడా ఉంటుంది. అందుకే ఎక్కువగా వాట్సాప్‌ను ఉపయోగిస్తారు. ఈ వాట్సాప్ ఎప్పటికప్పుడు వినూత్న అప్‌డేట్స్‌తో ముందుకు వస్తుంది. సాధారణంగా అయితే మన కాంటాక్ట్స్ లిస్టు లో లేని వ్యక్తికి వాట్సప్‌లో ఏదైనా పంపాలంటే ముందుగా అతని నెంబర్ సేవ్ చేసుకోవాలి. కానీ ఇప్పుడు ఆ అవసరం లేదు. నంబర్ సేవ్ చెయ్యకుండానే కొత్త వాళ్లకు మెసేజ్ పంపవచ్చు. వాట్సప్ సర్చ్ బార్ ఫీచర్ అందుబాటులోకి రావడంతో నంబర్ సేవ్ చేయాల్సిన అవసరం తప్పింది. ఆ ఫీచర్‌ను యాక్టివేట్ చేసుకుంటే నంబర్ సేవ్ చేయకుండానే మెసేజ్ పంపవచ్చు. అదెట్లనో ఇప్పుడు తెలుసుకుందాం..




**సేవ్ చేయని నెంబర్‌కు మెసేజ్ పంపడం ఇలా..**

–ముందుగా మన మొబైల్ ఫోన్‌లోని వాట్సాప్ యాప్‌ను ఓపెన్ చేయాలి.

–ఐఫోన్ యూజర్లైతే వాట్సాప్ యాప్ పైభాగంలో ప్లస్ ఐకాన్ ఉంటుంది. ఆండ్రాయిడ్ యూజర్లైతే కింద ప్లస్ ఐకాన్ ఉంటుంది. ఆ ఐకాన్‌పై క్లిక్ చేయాలి.

–ఆ తర్వాత సెర్చ్ కాంటాక్ట్‌పై క్లిక్ చేసి మెసేజ్ పంపదల్చుకున్న నంబర్‌ను కాపీ చేసి అక్కడ పేస్ట్ చేయాలి.

–ఆ నెంబర్‌కు వాట్సాప్ అకౌంట్ ఉంటే చాట్ ఆప్షన్ కనిపిస్తుంది. ఇక ఆ నంబర్‌తో వాట్సాప్ మెసేజ్ చెయ్యవచ్చు.

–ఇవేగాక వాట్సాప్ ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్స్‌తో కస్టమర్లను ఆకట్టుకుంటుంది.

## హైదరాబాద్‌లో టెక్ మహీంద్రా మరో ఆఫీస్

**హైదరాబాద్,**

: ప్రముఖ ఐటీ దిగ్గజం టెక్ మహీంద్రా..హైదరాబాద్‌లో మరో ఆఫీస్‌ను లీజుకు తీసుకున్నది. 4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఈ ఆఫీస్ స్థలాన్ని పదేండ్ల పాటు లీజుకు తీసుకున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం నెలకు రూ.3 కోట్లు అద్దె రూపంలో చెల్లించనున్నది. 400 మందికి పైగా కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసిన ఈ ఆఫీస్ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి రానున్నది.దేశీయ, అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజాలకు హైదరాబాద్ కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నదని, దీంతో ఇక్కడ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లను నెలకొల్పడానికి ముందుకొస్తున్నాయి. ఇప్పటికే పలు సంస్థలు ఇక్కడ జీసీసీలను నెలకొల్పాయి. వీటిలో ఉబర్ 9 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీసీసీని నెలకొల్పగా, టీసీఎస్ 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో, మైక్రోసాఫ్ట్ ఇండియా 2.64 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్పొరేట్ ఆఫీస్‌ను ప్రారంభించాయి.

## హాట్‌కేకులా హార్దిక్ పాండ్యా.. పట్టుపడుతున్న కోల్‌కతా, రాజస్థాన్..!

భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కోసం ఐపీఎల్ ఫ్రాంచైజీలు పోటీ పడుతున్నాయి. 20వ సీజన్‌కు ముందే పాండ్యాను వదిలించుకోవాలని ముంబై ఇండియన్స్ భావిస్తుండగా.. 'మాకివ్వండి.. మేము కొనుక్కుంటాం' అని ముందుకొస్తున్నాయి. మొన్నటివరకూ పాండ్యాను స్వాపింగ్ పద్ధతిన తీసుకునేందుకు రాజస్థాన్ రాయల్స్ ఆసక్తి చూపగా.. ఇప్పుడు కోల్‌కతా నైట్ రైడర్స్ సైతం రేసులోకి వచ్చింది.ఐపీఎల్ 2027కు ముందే ట్రేడ్ డీల్ హంగామా నడుస్తోంది. ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య పరస్పర ఒప్పందం కుదరడంతో.. రిషభ్ పంత్ ఢిల్లీకి, కుల్దీప్ యాదవ్ ను లక్నోకు మారారు. మరి.. హార్దిక్ పాండ్యా సంగతేంటీ? అని అభిమానులు అడుగుతున్నారు. ఎందుకంటే.. పంత్ – కుల్దీప్ స్వాపింగ్ కంటే ముందే పాండ్యా పేరు తెరపైకి వచ్చింది.ఐపీఎల్‌లో విలువైన ఆటగాడిగా నిరూపించుకున్న అతడిని రాజస్థాన్ రాయల్స్‌కు ఇచ్చేసి.. బదులుగా ఓపెనర్ యశస్వీ జైస్వాల్ ను తీసుకోవాలని ముంబై అనుకుంది. కానీ, అందుకు




రాజస్థాన్ తటపటాయించింది. ఇదిలా ఉండగానే.. మ్యాచ్ విన్నర్, నిఖార్సైన ఆల్‌రౌండర్ కోసం వెతుకుతున్న కోల్‌కతా నైట్ రైడర్స్ పాండ్యాను తీసుకునేందుకు ముందుకొచ్చిందని పీటీఐ కథనం పేర్కొంది.

**రహానే స్థానంలో**

ఐపీఎల్ 19లో కెప్టెన్‌గా విఫలమైన అజింక్యా రహానే స్థానంలో పాండ్యాను తెచ్చుకోవాలని కేకేఆర్ యాజమాన్యం భావిస్తోంది. అందుకని ముంబైకి పెద్ద మొత్తం చెల్లించి.. లేదంటే ట్రేడ్ డీల్ పద్ధతిన ఈ డాషింగ్ బ్యాటర్‌ను తమ గూటికి చేర్చుకోవాలని కోల్‌కతా పావులు కదుపుతోంది. మరోవైపు ముంబై ప్రతిపాదించినట్టుగా యశస్వీని అప్పగించి.. పాండ్యాను తీసుకునే అంశంపై రాజస్థాన్ రాయల్స్ తీవ్రంగా ఆలోచిస్తోంది. అయితే.. రియాన్ పరాగ్‌ను మరికొన్ని సీజన్లు కెప్టెన్‌గా కొనసాగించాలని రాజస్థాన్ అనుకుంటోంది. దాంతో, గులాబీ జెర్సీ వేసుకున్నా సరే పాండ్యాకు వెంటనే కెప్టెన్సీ దక్కకపోవచ్చు.టీ20ల్లో.. ముఖ్యంగా ఐపీఎల్‌లో హిట్టైన హార్దిక్‌ను దక్కించుకునేందుకు ఇరు ఫ్రాంచైజీలు ముంబై యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నాయి. అయితే.. చివరకు పాండ్యాను ఏ జట్టుకు ముంబై అప్పగిస్తుంది? అనేది ఉత్కంఠ రేపుతోంది. చూస్తుంటే.. వారం పది రోజుల్లో ముంబై, కోల్‌కతా, రాజస్థాన్ మధ్య ట్రేడ్ డీల్ జరిగే అవకాశముంది.

## గాయంతో టీ20 జట్టు నుంచి నితీశ్ ఔట్..!

ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌కు ముందు టీమిండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తర్వాత ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి తొడ కండరాల గాయం కారణంగా ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. కాగా, నితీశ్ స్థానంలో యువ ప్లేయర్ సూర్యాంశ్ షెడ్జెను బీసీసీఐ మంగళవారం జట్టులోకి ఎంపిక చేసింది. జూన్ 26, 28 తేదీల్లో ఐర్లాండ్‌తో , జులై 1 నుంచి ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్ ప్రారంభం కానుంది.అఫ్ఘానిస్థాన్‌తో వన్డే సిరీస్ ముగిసింది. భారత జట్టు త్వరలో ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో తలపడనుంది. ఇందులో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో టీమిండియా బరిలోకి దిగనుంది. జూన్ 26, జూన్ 28 తేదీల్లో ఐర్లాండ్ వేదికగా ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇప్పటికే బీసీసీఐ.. టీమిండియా జట్టును ఎంపిక చేసింది. కానీ మ్యాచ్‌లకు మూడు రోజుల ముందు టీమిండియాకు షాక్ తగిలింది. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి గాయం కారణంగా ఈ సిరీస్‌లకు దూరమయ్యాడు.ఇప్పటికే మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి టీ20 జట్టు నుంచి వైదొలగగా.. తాజాగా




తొడ కండరాల గాయం కారణంగా ఐర్లాండ్, ఇంగ్లాండ్‌లతో టీ20 సిరీస్‌కు అతడు అందుబాటులో ఉండడని బీసీసీఐ తెలిపింది. దీంతో ఈ సిరీస్‌లుకు నితీశ్ ప్లేసులో బీసీసీఐ సూర్యాంశ్ షెడ్జెను ఎంపిక చేసింది. ఈ మేరకు అధికారికంగా ప్రకటన విడుదల చేసింది.అఫ్ఘాన్‌తో వన్డే సిరీస్‌లో ఆడుతూ.. నితీశ్ రెడ్డి గాయపడ్డాడు. నిజానికి నితీశ్‌కు చిన్నదెబ్బే తగిలిందని అంతా భావించారు. కానీ ఎమ్మారైలో అసలు విషయం తెలిసింది. తొడ కండరాలకు గాయమైందని.. అతడు కోలుకునేందుకు నాలుగు వారాల టైమ్ పడుతుందని సమాచారం.

# స్పోర్ట్స్

## మళ్లీ కెప్టెన్‌గా స్టోక్స్..

- నాలుగు మార్పులతో ఇంగ్లండ్ తుది జట్టు..!




కెన్నింగ్‌టన్ ఓవల్‌లో భంగపడిన ఇంగ్లండ్ సిరీస్ పట్టేయాలనే కసితో ఉంది. సిరీస్‌ను సమం చేసిన న్యూజిలాండ్‌ను నాటింగ్‌హమ్‌లో చిత్తు చేయాలనుకుంటున్న ఆతిథ్య జట్టు నాలుగు మార్పులు చేసింది. లండన్ నైట్ క్లబ్ వివాదం సద్దుమణగడంతో కెప్టెన్ బెన్ స్టోక్స్, పేసర్ గస్ అట్కిన్సన్‌లు తిరిగి జట్టులోకి వచ్చారు. వికెట్ కీపర్‌గా జేమీ స్మిత్ ఎంపికవ్వగా.. స్పిన్నర్‌గా షోయబ్ బషీర్‌ను సెలెక్టర్లు తీసుకున్నారు.సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో 253 పరుగుల తేడాతో ఊహించని ఓటమి నుంచి తేరుకున్న ఇంగ్లండ్ మూడో టెస్టుకు పక్కాగా సిద్ధమైంది. జూన్ 25 గురువారం నాటింగ్‌హమ్‌లో మ్యాచ్ గెలిచి సిరీస్‌ను తన్నుకుపోవాలనుకుంటున్న ఆతిథ్య జట్టు.. నాలుగు మార్పులతో బరిలోకి దిగుతోంది.ఓవల్ టెస్టు ఆడిన జోర్డాన్ కాక్స్, రెవ్, సోనీ బేకర్, ఫిషెర్‌పై వేటు పడింది. బెన్ స్టోక్స్ తిరిగి కెప్టెన్సీ చేపట్టగా.. జేమీస్మిత్, సోయబ్ బషీర్, అట్కిన్సన్ తుది జట్టులోకి వచ్చారు.. రెట్టించిన ఉత్సాహంతో ఇంగ్లండ్ కనిపిస్తోంది.

**ఇంగ్లండ్ తుది జట్టు :** బెన్ డకెట్, ఎమిలియో గే, జాకబ్ బెథెల్, జో రూట్, హ్యారీ బ్రూక్, జేమీ స్మిత్(వికెట్ కీపర్), బెన్ స్టోక్స్(కెప్టెన్), అట్సిన్సన్, ఆర్చర్, జోష్ టంగ్, షోయబ్ బషీర్.



బ్లాక్ అవుట్‌ఫిట్‌లో స్టన్నింగ్ లుక్స్‌తో రకుల్ ప్రీత్ సింగ్.

# విజయ్‌ను అన్ ఫాలో చేసిన త్రిష



కొన్ని నెలలుగా సోషల్ మీడియాలో విజయ్– త్రిష పేర్లు వైరలైన విషయం తెలిసిందే. వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారని వార్తలు వచ్చాయి. తాజాగా వీరిద్దరూ విడిపోయారని ప్రచారం జరుగుతోంది. జూన్ 22న విజయ్ పుట్టినరోజు కావడంతో సినీ, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. విజయ్ సీఎం అయ్యాక తొలి పుట్టినరోజు కావడంతో త్రిష విషెస్ కోసం అందరూ ఎదురుచూశారు. ప్రతి సంవత్సరం ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపే త్రిష మాత్రం ఈసారి ఎలాంటి పోస్ట్ పెట్టకపోవడంతో నెట్టింట కొత్త చర్చ ప్రారంభమైంది. కొన్నేళ్లుగా విజయ్ పుట్టినరోజున ఆయనతో కలిసి దిగిన అరుదైన ఫొటోలను త్రిష పంచుకునే వారు. కానీ, ఈసారి ఆమె మౌనంగా ఉండడంతో పాటు.. ఇన్‌స్టాగ్రామ్‌లో విజయ్‌ను అన్‌ఫాలో చేశారు. దీంతో ఈ అంశంపై నెట్టింట చర్చ జరుగుతోంది.

# ఆదర్శకుటుంబం ఆలస్యం అవుతోందా ?





విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న క్రేజీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47. సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా విడుదల చేయబోతున్నట్లు ఇటీవల వార్తలు వినిపించాయి. కానీ పరిస్థితులు చూస్తుంటే అందుకు అనుగుణంగా లేవు అనే టాక్ వినిపిస్తోంది. ఫిల్మ్ నగర్ వర్గాల్లో ఈ సినిమా విడుదలపై ఒక షాకింగ్ గాసిప్ గట్టిగా వినిపిస్తోంది. ఈ మోస్ట్ అవేటెడ్ మూవీ అనుకున్న సమయానికి రావడం లేదని వాయిదా పడే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని టాక్ నడుస్తోంది. ఈ సినిమా షూటింగ్ లో కొన్ని అవాంతరాలు ఎదురయ్యాయని, కొన్ని సీన్స్ రీ షూట్ చేస్తున్నారని అక్టోబర్ 2లు షూటింగ్ ఫినిష్ అయ్యే అవకాశం లేదని టాక్. ఒకవేళ ఈ అక్టోబర్ లాంగ్ వీకెండ్ డేట్‌ను గనుక మేకర్స్ మిస్ చేసుకుంటే.. ఆ తర్వాత ఈ ఏడాదిలో సరైన విండో దొరకడం కష్టమేనని ఇండస్ట్రీ విశ్లేషకులు భావిస్తున్నారు. అదే జరిగితే, 'ఎకె 47' చిత్రాన్ని ఏకంగా 2027 సమ్మర్ సీజన్‌కు మాత్రమే పోస్ట్‌పోన్ చేసే అవకాశాలు ఉన్నట్లు గట్టిగా ప్రచారం సాగుతోంది. అయితే ఈ గాసిప్స్ పై ప్రొడక్షన్ హౌస్ నుండి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు అలాగే ఖండించలేదు. దీంతో వెంకీ ఫ్యాన్స్ కాస్త కంగారు పడుతున్నారు. మరి ఈ క్రేజీ ప్రాజెక్ట్ అనుకున్న సమయానికే వస్తుందా లేదా లాంగ్ డిలే అవుతుందా అనేది తెలియాలంటే మేకర్స్ క్లారిటీ ఇచ్చే వరకు వేచి చూడాల్సిందే.



# అతనికే అప్పగించండి!


సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే తారల్లో శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీకపూర్ ముందు వరుసలో ఉంటుంది. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ముద్దుగుమ్మ పెట్టిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పింక్ కలర్ నైట్ సూట్‌లో ఉన్న ఓ ఫొటోని ఇన్‌స్టాలో పోస్ట్ చేసి, దాని కింద.. 'ఒకవేళ నేను తప్పిపోతే.. దయచేసి శిఖర్ పహారియాకు నన్ను అప్పగించండి' అంటూ ఓ చమత్కారమైన సందేశాన్ని పొందుపరిచింది జాన్వీ. ప్రస్తుతం ఈ పోస్ట్‌పై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. 'ఎంతో ముద్దుగా ఉంది' అంటూ ఒకరు కామెంట్ చేస్తే, 'రిలేషన్‌షిప్ గోల్స్' అంటూ మరొకరు అభినందించారు.జాన్వీ, శిఖర్ పహారియా గత కొంతకాలంగా రిలేషన్‌లో ఉన్న విషయం విదితమే. అయితే, ఈ బంధాన్ని అధికారికంగా మాత్రం వారు ధృవీకరించలేదు. గతంలో 'శిఖర్' అనే పేరున్న నెక్లెస్‌ని జాన్వీ ధరించి కనిపించడం, శిఖర్ కూడా జాన్వీ నటించిన సినిమాలను సోషల్ మీడియా వేదికగా ప్రశంసించడం, వీటితోపాటు గత ఏడాది జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో జాన్వీతో కలిసి శిఖర్ కూడా సందడి చేయడం.. ఇవన్నీ వీరి రిలేషన్ రూమర్స్‌కి బలాన్ని చేకూర్చాయి. జాన్వీ రీసెంట్ పోస్ట్‌తో అది రూఢీ అయ్యింది.

# వరుస సినిమాలతో ప్రభాస్ బిజీ



ఇండియన్ సినిమా బిగ్గెస్ట్ సూపర్ స్టార్‌గా గుర్తింపు పొందిన ప్రభాస్ ప్రస్తుతం వరుస పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాడు. 'బాహుబలి' తర్వాత ఆయన క్రేజ్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించగా, ప్రతి సినిమా మీద అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. అయితే ఈ ఏడాది విడుదలైన 'రాజా సాబ్' సినిమా మాత్రం అభిమానులు ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. ఇదిలా ఉంటే, దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. మొదట ఈ చిత్రాన్ని 2026 చివర్లో విడుదల చేయాలని భావించినప్పటికీ, ప్రస్తుతం ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం 'ఫౌజీ' 2027లో విడుదలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. అయితే ఇదే ఇప్పుడు ప్రభాస్ అభిమానులకు మరింత ఆనందాన్ని కలిగిస్తోంది. ఎందుకంటే 2027లో ప్రభాస్ నుంచి ఏకంగా మూడు భారీ ప్రాజెక్టులు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందులో మొదటిగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్' ఉంది. ఈ చిత్రంలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడనే ప్రచారం ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. మరోవైపు 'బాహుబలి' ప్రపంచాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చే యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' కూడా 2027లో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. 'బాహుబలి' ఫ్రాంచైజీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ ప్రాజెక్ట్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే సమయంలో 'ఫౌజీ' కూడా అదే ఏడాదిలో విడుదలైతే, ప్రభాస్ అభిమానులకు ఒకే ఏడాదిలో మూడు భారీ ట్రీట్స్ లభించినట్లవుతుంది. దీంతో 2027ను ఇప్పటికే అభిమానులు 'ప్రభాస్ నామ సంవత్సరం'గా అభివర్ణిస్తున్నారు. భిన్నమైన కథలు, భారీ స్థాయి నిర్మాణ విలువలు, పాన్ ఇండియా మార్కెట్‌లో ప్రభాస్‌కు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా 'స్పిరిట్', 'ఫౌజీ', 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' చిత్రాలు ఒకే ఏడాదిలో విడుదలైతే భారతీయ సినీ పరిశ్రమలోనే అరుదైన రికార్డులు నమోదయ్యే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు అభిమానుల దృష్టి మొత్తం ఈ ప్రాజెక్ట్‌ల అధికారిక విడుదల తేదీలపైనే ఉంది.

# 'స్టూడెంట్'గా మేఘాంశ్ శ్రీహరి.. ఫస్ట్ లుక్ వైరల్




రాజ్‌దూత్, కోతి కొమ్మచ్చి సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు దివంగత నటుడు, రియల్ స్టార్ శ్రీహరి కుమారుడు మేఘాంశ్ శ్రీహరి. లాంగ్ గ్యాప్ తర్వాత కొత్త సినిమాతో అప్‌డేట్‌తో హాయ్ చెప్పాడు. మేఘాంశ్ శ్రీహరి హీరోగా నటిస్తోన్న చిత్రం స్టూడెంట్ (ాబసవత్). బాలు తత్వమసి డైరెక్ట్ చేస్తున్నఈ మూవీ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో మేఘాంశ్ శ్రీహరి డ్రాయింగ్ లుక్ కనిపిస్తుండగా.. బ్యాక్ డ్రాప్‌లో పేపర్‌పై కొన్ని కొటేషన్లను గమనించవచ్చు.ధైర్యం కలిగిన ఒక్క వ్యక్తి మెజారిటీ అవుతాడు.. మెంటల్ మాస్ తుఫాన్ రాబోతుందంటూ రిలీజ్ చేసిన లుక్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఈ సినిమా హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలపై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465